నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం
పేజీలు : 08



## నదిలో.. కోవెల



- పెన్నానది ఒడ్డున వెలుగులోకి వచ్చిన చారిత్రాత్మక నాగలింగేశ్వర స్వామి ఆలయం
- దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సంకల్పంతో.. కదిలిన యంత్రాంగం.. పూర్వ వైభవానికి నాంది
- ఆలయ పునర్నిర్మాణానికి రూ.కోటికి పైగా నిధులు మంజూరు

పెన్నానది ఒడ్డున ఉన్న ప్రాచీన శైవక్షేత్రం నాగలింగేశ్వరస్వామి ఆలయం.. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా విశేష ఆకర్షణగా నిలుస్తోంది. శతాబ్దాలుగా ఇసుక మేటల కింద నిగూఢంగా ఉన్న ఈ ఆలయం ఇటీవల వెలుగులోకి రావడంతో భక్తులు, చరిత్రాభిమానులు భారీగా తరలివస్తున్నారు. గ్రామ పెద్దల కథనాల ప్రకారం.. ఈ ఆలయానికి సుమారు 200 నుంచి 300 ఏళ్ల చరిత్ర ఉంది. పురావస్తు నిపుణులు ఇది 19వ శతాబ్దానికి చెందినదిగా నిర్ధారించారు. కాలక్రమేణా పెన్నానది వరదలు, ప్రకృతి ప్రభావంతో ఆలయం పూర్తిగా ఇసుకలో కప్పబడింది.

పొదలకూరు, మేజర్‌న్యూస్ :


నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలో పెన్నానది పరివాహక ప్రాంతంలో పెరుమాళ్లపాడు గ్రామం ఉండేది. ఆ ఊరిలో వందల ఏళ్లనాటి శ్రీ నాగలింగేశ్వరస్వామి ఆలయం ఉంది. భారీ వర్షాలు, వరదల సమయంలో పెన్నానది ఉధృతంగా ప్రవహించే సమయాల్లో ఆ గ్రామం మునకకి గురవుతుండేది. ఏటా ముంపు కష్టాలు భరించలేక, -మిగతా 2లో



పేదలకు సంజీవనిలా..

## సీఎం రిలీఫ్ ఫండ్

- ఆపద్బాంధవుడుగా నిలుస్తున్న సీఎం చంద్రబాబు
- సర్వేపల్లిలో ఇప్పటివరకు 672 మందికి రూ.6.28 కోట్ల సాయం



నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :

నెల్లూరులోని వేదాయపాలెం కార్యాలయంలో శుక్రవారం 38 మందికి మంజూరైన రూ.27.14 లక్షలకు సంబంధించిన చెక్కులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారు. నెల్లూరులో ప్రధానమైన అపోలో, కిమ్స్ (బొల్లినేని) వంటి ఆస్పత్రులు కూడా ఆ సేవల నుంచి వైదొలిగాయన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైన ఆనవాళ్లు కూడా కనిపించని పరిస్థితి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు పేదలకు ఎంతో అండగా నిలుస్తున్నారని, వైద్యబిల్లులతో దరఖాస్తు చేసుకున్న వారికి ఉదారంగా సాయం అందిస్తున్నారని తెలిపారు. పేదలందరి తరపున ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు.

అభివృద్ధికి నోచుకోని..

కలగానే నిలిచిపోయిన 'స్మార్ట్ సిటీ'

## డివిజన్లు!



నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :

నగర పాలక సంస్థ పరిధిలో 54 డివిజన్లు ఉండగా వాటిలో కొన్ని డివిజన్లు ఇంకా అభివృద్ధికి పూర్తిస్థాయిలో నోచుకోకపోవడం విశేషం. సుమారు 9 లక్షల జనాభా ఉన్న నగరపాలక సంస్థ పరిధిలో రోజురోజుకు జనాభా పెరిగిపోతోంది. అందంకు అనుగుణంగా అవసరమైన మౌలిక సదుపాయాలు నగరపాలక సంస్థ ఆయా ప్రాంతాల్లో ప్రజలకు కల్పించకపోవడం విశేషం. నెల్లూరు నగరాన్ని స్మార్ట్ సిటీ -మిగతా 2లో

- అరకొరగా ఫుట్‌పాత్‌లు
- పూర్తికాని భూగర్భ డ్రైనేజీ
- ప్రజలకు తప్పని దోమల బెడద
- నగరంలో పూర్తిస్థాయిలో లేని పచ్చదనం
- మిగిలి ఉన్న 10 నెలలలోనైనా పనులు పూర్తయ్యేనా ?
- దెబ్బతిన్న రోడ్లతో అవస్థలు పడుతున్న జనం
- నేటికీ భర్తీ కాని స్టాండింగ్ కమిటీ
- నేడు కార్పొరేషన్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం




## పెద్దపులి కలకలం

- బొంగులగడ్డ ప్రదేశంలో ఆవు
- కళేబరాన్ని పరిశీలించిన అటవీ అధికారులు
- కళేబరానికి పోస్టుమార్టం నిర్వహణ

ఉదయగిరి, మేజర్‌న్యూస్ :

ఉదయగిరి దుర్గం అడవుల్లో పెద్దపులి కలకలం సృష్టిస్తోంది. గత కొన్ని రోజులుగా రహదారులు, గ్రామాల సమీప అటవీ ప్రాంతాల్లో సంచరిస్తూ.. ప్రజలను భయభ్రాంతలకు గురి చేస్తున్న విషయం విదితమే. తాజాగా ఉదయగిరి దుర్గంపై గల కోనకాలువకు సమీపాన ఉన్న బొంగులగడ్డ -మిగతా 2లో

# నదిలో కోవెల



*(మొదటి పేజీ తరువాయి)*

ఆ ఊరి ప్రజలు దూరంగా మరోచోట ఊరిని నిర్మించుకోవాలని భావించారు. ఎగువ భాగాన ఇళ్లు నిర్మించుకుని ఊరిని ఏర్పాటు చేసుకున్నారు. పాత ఊరిని, ఊరిలో ఇళ్లు, నాగలింగేశ్వర స్వామి ఆలయాన్ని అలాగే వదిలేశారు. కాలక్రమేణా పాత ఊరు ఊరంతా ఇసుక మేటల కింద పూడిపోయింది.

✱ కరోనా సమయంలో హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై వంటి ప్రాంతాల్లో సాఫ్ట్ వేర్ ఉద్యోగులు ఊరికొచ్చారు. వర్క్ ఫ్రం హోమ్ చేస్తుండేవారు. ఆ సమయంలో పెద్దలు... పెన్నానది నీటి ప్రవాహంతో గ్రామం ఇసుక మేటల కింద పూడిపోయిందని చెప్పారు. అక్కడ పురాతన శివాలయం ఉండేదని.. ప్రతి ఏటా ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగేవని తెలిపారు. వెంటనే ఆ యువకులు సొంత నిధులతో తవ్వకాలు జరిపారు. నాగలింగేశ్వర స్వామి ఆలయాన్ని వెలికితీశారు. ఆ సంగతి పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. దాంతో ఎక్కడెక్కడి నుంచో చరిత్రకారులు, యూట్యూబర్లు, పర్యాటకులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుండేవారు.

✱ ప్రముఖ హీరో ప్రభాస్ నటించిన కల్కి సినిమాలో అశ్వద్ధామ పాత్రకి సంబంధించిన కొన్ని సన్నివేశాలని ఇక్కడే చిత్రీకరించారు. దాంతో ఈ ఆలయ విశిష్టత, పురాతన చరిత్ర పెద్ద ఎత్తున ప్రచారం సాగింది.

✱ జగన్ ప్రభుత్వ హయాంలో స్థానికులు, శివ భక్తులు... ఈ ఆలయాన్ని పునఃనిర్మాణం చేపట్టాలని ప్రజాప్రతినిధులని వేడుకున్నారు. కానీ.. ఎవ్వరూ పట్టించుకోలేదు.

✱ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇటీవల ఈ ఇసుక దిబ్బల్లో కిలో మీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లి, ఈ ప్రాంతాన్ని సందర్శించారు. వెంటనే ఆలయాన్ని పూర్తిగా వెలికితీయాలని అధికారులని ఆదేశించారు. ముంపు ప్రభావంలేని చోట ఆలయాన్ని పునః నిర్మిస్తామని హామీనిచ్చారు. అందుకు రూ. 1.5 కోట్ల నిధులు కేటాయించారు. ఆధ్యాత్మికతో పాటు సమీపంలోనే పెన్నానది ఉండటం వల్ల, పర్యాటకంగా కూడా అభివృద్ధి చేసేందుకు మంత్రి ఆనం ఆలోచనలు చేస్తున్నారు. ఆలయాన్ని పునఃనిర్మాణానికి శ్రీకారం చుట్టడం, వందల ఏళ్లనాటి మహిమాన్విత శ్రీ నాగలింగేశ్వరస్వామి శివలింగం పునఃప్రతిష్ఠ కాబోతూ ఉండటం పట్ల స్థానికులు, శివభక్తుల ఆనందానికి హద్దు లేదు.

## నేడు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు. ఏఈఆర్వోలు, ఎన్నికల సిబ్బందితో ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వెంకటరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎల్.రామ్మోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావున నియోజకవర్గంలోని అన్ని మండలాల ఏఈఆర్వోలు, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

## నేడు హెచ్ఎంల సమావేశం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక స్త్రీశక్తి భవనంలో శనివారం విద్యాంజలి కార్యక్రమంపై మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈవో-2 శ్రీనివాసులు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. కావున ప్రధానోపాధ్యాయులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

# అభివృద్ధికి నోచుకోని డివిజన్లు



*(మొదటి పేజీ తరువాయి)*

చేస్తామని చెబుతున్నారు తప్ప అది ఆచరణలోకి రాకపోవడం గమనార్హం. రాష్ట్రంలోనే నెల్లూరు నగరపాలక సంస్థ నాలుగో స్థానంలో ఉన్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం కొన్ని డివిజన్లు ఇప్పటికీ వెనుకబడి ఉన్నాయి. 2013వ సంవత్సరంలో నగరపాలక సంస్థలో కొన్ని పంచాయతీలు విలీనమైనప్పటికీ వాటిలో కొన్నింటిలో ఇప్పటికీ పూర్తిస్థాయిలో మౌలిక వసతులు లేకపోవడం విశేషం. ప్రస్తుతం అధికార పార్టీకి పూర్తిస్థాయిలో మెజార్టీ సభ్యులు ఉన్నారు. అభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపించే అవకాశం ఉంది. ఆ దిశగా సభ్యులు ప్రయత్నిస్తే నెల్లూరు నగరపాలక సంస్థ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందే అవకాశం ఉంది. ఇక పాలకవర్గానికి 10 నెలలలోపు మాత్రమే సమయం ఉంది. ప్రజా ప్రతినిధులు ఉన్న ఈ తక్కువ సమయంలో అభివృద్ధి చెందవలసిన డివిజన్లపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని అభివృద్ధి చేస్తే బాగుంటుందని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. కొన్ని డివిజన్లలో జనాభా ఎక్కువగా ఉన్నారు. అలాంటి వాటిలో అవసరమైన మౌలిక సదుపాయాలు లేకపోవడం విశేషం. చాలాచోట్ల రోడ్లు దెబ్బతిని కనీసం గంపడు మట్టి కూడా నోచుకోక ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా చాలా చోట్ల రోడ్లు ఆక్రమణలకు గురై ఉన్నాయి. నగరపాలక సంస్థకు రాబడి వచ్చే అవకాశాలు ఉన్నప్పటికీ వాటిపై కొందరు దృష్టిపెట్టకపోవడంతో నగరపాలక సంస్థకు రావలసిన రాబడి సకాలంలో రాక అభివృద్ధికి గండి పడుతోంది. పెద్దపెద్ద సంస్థల నుంచి, వైద్య, విద్యాసంస్థల నుంచి ట్రేడ్ లైసెన్సులు, ఆస్తి పనులు పూర్తిస్థాయిలో వసూలు కాకపోవడం విశేషం. ఇవన్నీ పూర్తిస్థాయిలో వసూలైతే నగరపాలక సంస్థ అభివృద్ధితో పరుగులు తీయనుంది. అదేవిధంగా నగరంలో డివైడర్లలో పచ్చదనం పూర్తిస్థాయిలో లేకపోవడం విశేషం. పలు ప్రకటన సంస్థలు నగరపాలక సంస్థకు చెల్లించవలసిన పైకం పూర్తి స్థాయిలో చెల్లించకుండా గండికొడుతూ వారు లాభం పొందడం విశేషం. ప్రకటనలకు సంబంధించి నగరపాలక సంస్థకు లక్షల రూపాయలు ఆదాయం రావలసి ఉన్నప్పటికీ అది పూర్తిస్థాయిలో రాకపోవడం వాటిపై దృష్టి పెట్టకపోవడంతో ప్రకటనలకు సంబంధించి రావాల్సిన ఆదాయం చాలావరకు గండి పడుతుందని తెలుస్తోంది.

అదేవిధంగా నగర పాలక సంస్థ పాలకవర్గం ఏర్పడి ఉన్నప్పటికీ ఇంత వరకు స్టాండింగ్ కమిటీ ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి కాకపోవడంతో నగరంలో దోమల జోరు వల్ల ప్రజలు అల్లాడుతున్నారు. వీటి కోసం నగర పాలక సంస్థ అధికారులు లక్షల రూపాయలు ఖర్చు చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. నగరంలో ఆక్రమణలకు సంబంధించిన పన్నులు కూడా పూర్తిస్థాయిలో వసూలు కావడం లేదని సమాచారం. కొంతమంది నగరపాలక సంస్థ కు సంబంధించిన రోడ్ల పక్కన స్థలాల్లో వ్యాపారులకు అద్దెకిచ్చి సొమ్ములు చేసుకోవడం విశేషం. నగరంలోని ప్రధాన రహదారులో ఫుట్పాట్లు లేక ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మనకు విశాలమైన రోడ్లు ఉన్నప్పటికీ వాటిని కొందరు ఆక్రమించడంతో అవి కుదించుకుపోయాయి. దీంతో నగరంలోని ప్రధాన రహదారులైన ట్రంక్ రోడ్డు, విఆర్‌సి, ఆర్టీసీ, మద్రాస్ బస్టాండ్, కలెక్టరేట్ ప్రాంతం ఆచారి వీధి, వేదాయపాలెం, జిఎన్టి రోడ్డు, కొండాయపాలెం, తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు లేక పాదచారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. నగర పాలక సంస్థలో శనివారం జరిగే కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో ఆయా డివిజన్లలో అభివృద్ధిపై ఆ డివిజన్ కార్పొరేటర్లు సమస్యలపై గళం విప్పి వాటి అభివృద్ధి కోసం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇకనైనా అధికారులు ప్రజాప్రతినిధులు నెల్లూరు నగరపాలక సంస్థ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధికి నోచుకోని డివిజన్లను అభివృద్ధి చేసి నెల్లూరును 'స్మార్ట్ సిటీ'గా తీర్చిదిద్దవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# దుర్గం అడవుల్లో పెద్దపులి కలకలం




*(మొదటి పేజీ తరువాయి)*

ప్రాంతంలో ఆవు కళేబరాన్ని గురువారం జీవాల కాపర్లు గుర్తించారు. సమాచారం అందుకున్న కావలి సబ్ డీఎఫ్‌వో శ్రీకాంత్ రెడ్డి, ఉదయగిరి రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజాలు శుక్రవారం తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆవు కళేబరాన్ని పరిశీలించారు. కళేబరం సమీపాన పెద్దపులి, చిరుతపులి సంచరించిన ఆనవాళ్లు ఏమైనా ఉన్నాయా.. అని పరిశీలించారు. ఆ ప్రాంతమంతా కొండ రాళ్లు, గడ్డి ఏపుగా పెరిగి ఉండడంతో ఎక్కడా పాదముద్రలు లభ్యం కాలేదు. అయితే జీవాల కాపర్లు మాత్రం ఆవుపై దాడి చేసింది పెద్దపులేనని, కోనకాలువ పైభాగాన ఆవుపై దాడి చేసి అక్కడ నుంచి కిందభాగంలో ఉన్న బొంగులగడ్డ చెట్ల పొదల్లోకి కళేబరాన్ని లాక్కెళ్లిందని, ఆ అనవాళ్లు సైతం స్పష్టంగా కనిపిస్తున్నాయని తెగేసి చెబుతున్నారు. అనంతరం గండిపాళెం పశు వైద్యాధికారి ఎస్వీఎస్ రాఘవేంద్రశర్మ తన సిబ్బందితో ఆవుకు పోస్టుమార్టం నిర్వహించారు. ఆవుపై దాడి చేసింది పెద్దపులి, చిరుత అని నిర్ధారించలేమని, పోస్టుమార్థం నివేదిక వచ్చిన తరువాత వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలుపుతున్నారు. కాకపోతే ఆవుపై వైల్డ్ ఎనిమిల్ దాడి చేసినట్లు సూచనప్రాయంగా వివరించారు. సబ్ డీఎఫ్‌వో మాట్లాడుతూ.. దుర్గం పర్యాటక ప్రాంతం కావడంతో పర్యాటకులు ఎవరూ ఒంటిరిగా రావద్దని, సమూహంగా రావాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్వో చినవెంకటయ్య, ఏబీవో బచ్చుల వెంకటేశ్వర్లు, అటవీ, పశు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



# మహిళ దారుణ హత్య






**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** నగరంలోని నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆర్ఎస్ ఆర్ స్కూల్ దగ్గర విజయ్ గోపాల్‌పురంలో బండి జయలక్ష్మి (35) అక్రమ సంబంధం కొనసాగిస్తుందని అనుమానంతో భర్త తలపల కుమార్ శుక్రవారం మధ్యాహ్నం విచక్షణా రహితంగా చాకుతో పొడిచి హతమార్చారు. సమాచారం తెలుసుకున్న నవాబుపేట పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. క్లూ టిమ్స్ ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్నారని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని నెల్లూరు టౌన్ ఏఎస్పీ దీక్ష వెల్లడించారు.


# ఆత్మకూరులో పి4 అమలుకు ప్రత్యేకంగా కృషిచేస్తున్న ఆర్డీవో



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రభుత్వం నూతనంగా రూపొందించిన పి4 కార్యక్రమం అమలుకు స్థానిక ఆర్డీవో, ఈకార్యక్రమానికి ప్రభుత్వం నోడల్ అధికారిణిగా నియమించిన భూమిరెడ్డి పావని ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొని దృష్టి సారించి కృషిచేస్తున్నారు. ఈ పథకం ద్వారా బంగారు కుటుంబంగా గుర్తించబడిన చెర్లోయడవల్లికి చెందిన గిరిజనులు జ్ఞానమ్మకు మార్గదర్శకుడుగా నాగేశ్వరరావు ఆమె మేకలు కొనుగోలుకు 1లక్ష రూపాయలు అందజేయగా ఆర్డీవో ఆ కటుంబానికి ఇంటిస్థలం కేటాయించి ఇల్లు మంజూరు చేయించి శంఖుస్థాపనకూడా ఇటీవల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్2047 ప్రకటించి అందులోభాగంగా పి4 పథకాన్ని రూపొందించి అమలులోకి తెచ్చిన విషయం విధితమే. ఇందులో బాగంగా దాతలను గుర్తించి మార్గదర్శకులుగా, నిరుపేద కుటుంబాలను గుర్తించి బంగారుకుటుంబంగా నామకరణం గావించిన విషయం తెల్పిందే. అభివృద్ధి, సంక్షేమం, సమస్యల పరిష్కారం, ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను నూరుశాతం అమలుచేయాలని చర్యలు తీసుకునే రాష్ట్రదేవాదాయ శాఖామాత్యులు ఆనం రామ నారాయణరెడ్డి పి4 పథకం కూడా లక్ష్యం మేరకు అమలుచేయాలని భావిస్తూ నియోజకవర్గస్థాయిలో నోడల్ అధికారిణి భూమిరెడ్డి పావని అధ్యక్షతన అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కాగా తమ విధుల్లో అత్యంత చురుగ్గా, అంకితభావంతో నిబ్ధతతో వ్యవహరించే ఆర్డీవో పావని పి4 కార్యక్రమ నోడల్ అధికారిణిగా ఈకార్యక్రమాన్ని కూడా మెరుగ్గా అమలుచేయాలని భావిస్తున్నారు. ఆమె నాలుగు నెలల క్రితం ఆత్మకూరులో నిర్వహించిన మెగాజాబ్‌మేళా కార్యక్రమానికి చైర్మెన్‌గా వ్యవహరించి అత్యంత పటిష్టంగా నిర్వహించడం, దాదాపు 3వేల మందికి ఉద్యోగావకాశాలు లభించడం తెల్సిందే. దాంతో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్‌ల చేతుల మీదుగా, గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్లా చేతులమీదుగా జిల్లా స్థాయి ఉత్తమ ఆర్డీవో అవార్డులను అందుకున్నారు. ఏకార్యక్రమాన్నైనా సక్రమంగా లక్ష్యసాధనదిశగా నిర్వహించాలని భావించే యువ అధికారిణి పావని పి4 కార్యక్రమాన్ని నియోజకవర్గంలో లక్ష్యంకన్నా అధికంగా అమలుచేయాలని భావించి ఆమేరకు కార్యసాధనకు దిగారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆత్మకూరు మున్సిపాలిటీ, ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, సంగం, చేజర్ల, మర్రిపాడు మండలాల్లో ముమ్మరంగా పర్యటించారు. ఆయా మండలాల అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మార్గదర్శకులను, బంగారుకుటుంబాలను గుర్తించి ఎంపికచేశారు. ఆత్మకూరు రూరల్ మండలంలో 467మంది బంగారు కుటుంబాలను, 102మంది మార్గదర్శకులను, ఆత్మకూరు అర్బన్‌లో 732 బంగారుకుటుంబాలు, 112మంది మార్గదర్శకులు, అనంతసాగరం మండలంలో 697 బంగారు కుటుంబాలు,11మంది మార్గదర్శకులను, ఏఎస్‌పేట మండలంలో 459 బంగారుకుటుంబాలను, 112 మంది మార్గదర్శకులను, చేజర్ల మండలంలో 523 బంగారు కుటుంబాలు, 119మంది మార్గదర్శకులను, మర్రిపాడు మండలంలో 956బంగారుకుటుంబాలు, 158మంది మార్గదర్శకులను, సంగం మండలంలో 861 బంగారు కుటుంబాలను, 112మంది మార్గదర్శకులను ఎంపిక చేశారు. ఆయా నిరుపేదలుగా బంగారుకుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లిలో నిరుపేద గిరిజనులైన జ్ఞానమ్మ కుటుంబాన్ని నాగేశ్వరరావు అనే దాత దత్తత తీసుకోగా ఆ కుటుంబజీవనోపాధికి నాగేశ్వరరావు ఒక లక్షరూపాయలను ఆర్డీవో పావని చేతులమీదుగా ఆ కుటుంబానికి అందజేయగా వారు మేకలను కొనుగోలు చేసి ఉపాధి ఏర్పరుచుకున్నారు. ఈసందర్భంగా ఆర్డీవో పావని మాట్లాడుతూ పి4 కార్యక్రమంలో మార్గదర్శకులుగా ఎంపికైన వారు బంగారుకుటుంబాలను దత్తత తీసుకోవాలని, ఆ కుటుంబీకులకు ప్రభుత్వ సంక్షేమఫలాలు అందుతున్నాయా, లేదంటే వారికి అందేలా సంబంధిత దరఖాస్తులు చేయించి మంజూరు చేయించడం, అవసరమైన ఇంటినివేశనస్థలాలు, గృహాలు మంజూరు చేయించడంతోపాటు వారి జీవనోపాధికి అవసరమైన ఆర్థికసాయమందించడం చేయాలని, పి4 లక్ష్యం అదేనని ఆమె పేర్కొన్నారు. కేవలం విరాళాలు ఇవ్వడమే కాదని, ఆయా కుటుంబాల స్థితిగతులను పరిశీలించి ప్రభుత్వం ద్వారా అవకాశాలున్నవాటిని అందేలా చూడడం, అవసరమైన స్వయం ఉపాధికి అవకాశాలు చూపడం ఈపథకం లక్ష్యమని, అందువలన ఆర్థిక స్థోమత కలిగిన వారు స్వచ్ఛందంగా మార్గదర్శకులుగా రావాలని, నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని, తద్వారా పేదరికనిర్మూలన జరగాలని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం, రాష్ట్రదేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆశయం అదేనని, అందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, స్వచ్ఛంద, ప్రజాసంఘాల వారు, ప్రజలు సహకరించి పి4ను విజయవంతం చేయాలని, తద్వారా పలు కుటుంబాలను దారిద్ర్యరేఖకన్నా పైకి తేవాలని పావని కోరారు. ఆమె పట్టుదల, శ్రద్ధ, చిత్తశుద్ధి గమనిస్తుంటే పి4 పథకాన్ని లక్ష్యం దిశగా సాగించగలదని పలువురు భావిస్తున్నారు. ఈపథకాన్ని అందరూ స్వచ్ఛందంగా భావించేలా తమవంతుగా ప్రయత్నిస్తున్నామని, పేదకుటుంబాలు వృద్ధిచెందాలన్న ఆశయంగా, సంకల్పంగా కృషి చేస్తున్నామని పావని పేర్కొన్నారు.

# విద్యార్థిసంఘ నాయకుడి కిడ్నాప్‌కు వ్యతిరేకంగా ఎస్‌ఎఫ్‌ఐ నిరసన

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తిరుపతిలోదవిద్యార్థిసంఘ నాయకుడిని కిడ్నాప్ చేయడాన్ని ఖండిస్తూ శుక్రవారం ఆత్మకూరులో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్డీవో భూమిరెడ్డి పావనికి వారు ఒక వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మాట్లాడుతూ విద్యార్థిసంఘ నాయకుడిపై దాడిచేయడం, కిడ్నాప్‌చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్శిటికి సంబంధించి విద్యార్థులనుండి ఫీజుల దోపిడీ చేస్తుండడాన్ని వ్యతిరేకిస్తూ తిరుపతి ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పలుదపాలు ధర్నాలు చేశారన్నారు. అయినా యాజమాన్యం మొండివైఖరి విడనాడలేదన్నారు. ఈవిషయమై ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నాచేసేందుకు కలెక్టర్ కార్యాలయానికి వెళుతున్న సమయంలో మార్గమధ్యంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అక్బర్, వినోద్‌లపై దాడులు చేసి కిడ్నాప్ చేశారని వారు పేర్కొన్నారు. ఈసంఘటనను తాము తీవ్రంగా



ఖండిస్తున్నామని పేర్కొంటూ ప్రవేటు యూనివర్శిటీలో విద్యార్థులనుండి అధికఫీజులు వసూలుచేస్తుండడం, కనీసం రెగ్యులేషన్ లేకుండా ఉన్న పరిస్థితిపై అందరూ స్పందించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ నాయకులు ఖాదర్‌బాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆత్మకూరులో భరించలేని కోతుల బెడద

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని వివిద ప్రాంతాల్లో కోతులబెడద తీవ్రంగా ఉంటూ జనాలు మరింతగా ఇబ్బందిపడుతున్నారు. ప్రధానంగా జెఆర్‌పేట, కొలగానిసత్రం ఏరియాల్లో కోతులు అధికంగా ఉంటూ నానా భీభత్సం సృష్టిస్తున్నాయి. ఇళ్ళలో దూరి వస్తువులను ఛిన్నాబిన్నం చేయడం, ఆహారపధార్థాలు, తినుబండారాలను ఎత్తుకెళ్ళడం, విద్యుత్, డిష్ వైర్లను ఛిన్నాభిన్నం చేస్తుండడంతో జనాలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈకోతుల సంచారంతో చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారు. ఎన్నిమార్లు అధికారులకు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని జనాలు వాపోతున్నారు. కోతులు ఇళ్ళలో నానాభీభత్సం చేస్తూ నష్టపరుస్తూ ఉంటాయి. సమీపంలోని చెట్లమీద ఉంటూ ఎప్పుడుపడితే అప్పుడు వైర్లమీద వ్రేలాడుతూ ఉండడం, ఇళ్ళలోకి జనాలమధ్యనుండే వెళ్ళి దూరుతుండడంతో అత్యంత ఇబ్బందికరంగా ఉంటోంది. దుకాణాల వద్ద కూడా ఈకోతులు పండ్లు, కూరగాయలు, సరుకులు తదితరాలను ఎత్తుకెళుతూ నష్టపరుస్తున్నాయి. వాటిని ఏమాత్రం అదిలించినా పైకిదూకేలా భయపెడుతుంటాయి. ఈపరిస్థితిని అధికారులు గమనించి తగు చర్యలు తీసుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.

# పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పదవ తరగతిలో నూరు శాతం ఫలితాలు సాదించా లని మండల విద్యాశాఖ అధికారి టి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం దాసరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతి విద్యార్థుల 100 రోజుల ప్రణాళికలో భాగంగా పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి గణిత విషయం నందు తక్కువ సమయంలో ఎక్కువ మార్కులు ఎలా సాధించాలి అదేవిధంగా మంచి దస్తూరి రాయడం వలన ఎన్ని మార్కులు పెరుగుతాయి అనే విషయాలు విద్యార్థులకు తెలియజేశారు. ప్రతి సబ్జెక్టులో ఉన్న పాఠ్యాంశాలలో ఏవి ముఖ్యమైన పాఠ్యాంశాలు అని నిర్ధారించుకొని గత పరీక్ష పేపర్లను దగ్గర పెట్టుకొని ఏఏ ప్రశ్నలు ఇస్తున్నారు. సరిగా చూసుకుని అన్నింటి మీద అవుట్ లుక్ కలిగి ఉన్నట్లయితే పబ్లిక్ పరీక్షలను చాలా తేలికగా ఎదుర్కొని విజయం సాధించవచ్చునని తెలియజేశారు. పబ్లిక్ పరీక్షలలో ప్రతి విషయంలోనూ నూటికి నూరు శాతం మార్కులకు జవాబులు వ్రాయాలని అంతేకాకుండా నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయినీ ఉపాధ్యాయు లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యురాలు షేక్ ఖాదర్‌బాషా ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రైల్వే ఉద్యోగి నాగరాజు అనుమానాధస్పద మృతి

**కావలి, మేజర్‌న్యూస్ :** రూరల్ మండలం రుద్రకోటలో రైల్వే ఉద్యోగి అడవిరాజ్‌పాలెం రైల్వే గేట్ మేనగా పనిచేయుచున్నారు. అయితే అందిన సమాచారం మేరకు కుటుంబంలో వచ్చిన విభేదాల వలన ఈ హత్య జరిగిండొచ్చునండి అనుమానం వ్యక్తం చేశారు. అంతేకాకుండా మృతదేహం మీద కత్తితో పొడిచినట్లు ఘాట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతులు నాగరాజును ఎక్కడో బయట ప్రదేశం లో హత్య చేసి అర్ధరాత్రి ఎవరు లేని సమయంలో తన ఇంట్లో మంచం మీద పడుకోబెట్టి వెళ్లి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున గ్రామస్తులు. అందిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్రాల మడుగు సంఘం అభివృద్ధిపై

# నారాయణ ప్రత్యేక శ్రద్ధ ఉంది

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** మాకు సమస్యలేవీ లేవు. ఏముంటే సమస్య అని చెప్తాము.. జనసేన మా వీధి రోడ్డు సమస్య తీర్చింది. నారాయణ మా బతుకు తెరువుకు బండి ఇచ్చారు..



ప్రతిగడపకి జనసేన కార్యక్రమం, గుర్రాల మడుగు సంఘం, 16వ డివిజన్, నెల్లూరు సిటీ. నగర అభివృద్ధిలో భాగంగా ఇల్లు కోల్పోతే వారికి నారాయణ సార్ ఇళ్లు ఇచ్చే ముందుకు సాగుతారు.. సిటీ ప్రజలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నారు. నారాయణ, విజయలక్ష్మి గునుకుల జనసేన కూటమి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపే లక్ష్యంతో 'ప్రతిగడపకి జనసేన' కార్యక్రమం ఈరోజు నెల్లూరు సిటీ 16వ డివిజన్ గుర్రాల మడుగు సంఘంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసేన వీర మహిళ గునుకుల విజయలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల, అలాగే 16వ డివిజన్ నాయకులు నరహరి, ఏలూరు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రజలతో ఆత్మీయంగా ప్రతి గడప నీ పబకరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా కొందరు స్థానికులు తమ ప్రాంతంలో రోడ్లు వేయించడంలో జనసేన పార్టీ పాత్ర ఉందని, నారాయణ జీవనోపాధికి బండిని అందించారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలో సమస్యలు తక్కువగా ఉన్నాయని, చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై నాయకులు స్పందిస్తూ, ప్రజల నుంచి వచ్చిన సమస్యలను స్థానిక అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా గుర్రాల మడుగు సంఘం అభివృద్ధిపై నారాయణకి ప్రత్యేక శ్రద్ధ ఉందని పేర్కొంటూ, నగరాభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. అభివృద్ధి కార్యక్రమాల భాగంగా మార్కింగ్ చేసిన ఇళ్ల విషయంలో స్వచ్ఛంద సహకారం అవసరమని, ఏవైనా కారణాల వల్ల ఇల్లు కోల్పోయే పరిస్థితి వస్తే పేదలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల, ఏఎంసి డైరెక్టర్ జనసేన వీర మహిళ విజయలక్ష్మి, 16వ డివిజన్ నాయకులు నరహరి, వీర మహిళలు ఏలూరు విజయలక్ష్మి, కల్పన, భవాని, ఆమని, ప్రవల్లిక, జనసేన నాయకులు చిత్తూరు బాలాజీ, అశోక్, వర్షన్, శివ, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సిటీ..రూరల్ యూనిట్స్ ఎన్నికల్లో..

# ఉద్యోగులంతా భాగస్వాములు కావాలి

**ఏపీజీఈఏ జిల్లా కార్యదర్శి పీవీఎస్‌టీ రాంప్రసాద్**



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) నెల్లూరు సిటీ, రూరల్ యూనిట్లకు నూతన కార్యవర్గ సభ్యుల నియామకపు ఎన్నికలు ఈనెల 08న (ఆదివారం) ఎన్నికల అధికారులు వై.దినేష్ రెడ్డి, ఎం.సురేష్ ఆధ్వర్యంలో జరుగనున్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులంతా స్వచ్ఛందంగా భాగస్వాములై తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏపీజీఈఏ జిల్లా కార్యదర్శి పీవీఎస్‌టీ రామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలోని వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 8న నిర్వహించనున్న ఏపిజిఈ ఏ సమావేశం తోపాటు నెల్లూరు సిటీ, రూరల్ యూనిట్స్ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకొని తద్వారా ఏపీ జిఈఏను మరింత బలోపేతం దిశగా ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో ఈనెల 8న నూతన కార్యవర్గ ప్రతినిధులను స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య ధోరణిలో ఎన్నుకోవాలని సూచించారు. ఉద్యోగుల సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలోనూ.. న్యాయబద్ధమైన డిమాండ్ల సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేయడంలోనూ ఏపీ జిఈ ఏ ఉద్యోగుల పక్షాన నిలిచి తనదైన కీలక భాగస్వామ్య పాత్రను పోషిస్తుందన్నారు. సమర్థవంతమైన నాయకత్వంతో అన్ని వర్గాల కు చెందిన ప్రభుత్వ ఉద్యోగుల భద్రతకు భరోసా ఇస్తూ విశేష ఆదరణను చూడకుంటున్న ఏపీజీఈ ఏ భవిష్యత్ కార్యాచరణను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సిటీ, రూరల్ యూనిట్స్‌లలో బలమైన నాయకత్వాన్ని ఎన్నుకునే దిశగా ఈనెల 8న అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న నూతన కార్యవర్గ సభ్యుల ఎంపిక లో ఉద్యోగులంతా స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికలకు ఏపీజిఈఏ కోవూరు కార్యదర్శి ఎన్.చంద్రశేఖర్, ఇందుకూరుపేట తాలూకా కార్యదర్శి కే.విద్యాసాగర్‌రెడ్డిలు సహాయ ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# ప్రకృతిని చూసే భాగ్యం కలిగించిన వేమిరెడ్డి దంపతులు




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వీపీఆర్ ఫౌండేషన్ అధినేత నెల్లూరు పార్లమెంట్ జీవి సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు నియోజకవర్గం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలు కంటి చూపు లేని వారికి ఈ ప్రకృతిని చూసే భాగ్యం ఉండదని వారికి అలాంటి అదృష్టం కలిగించే విధంగా వేమిరెడ్డి దంపతులు కృషి చేయడం మనందరి అదృష్టం పేదల పట్ల వారు చూపుతున్న ప్రేమాభిమానులు మరవలేనియని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం మండలంలోని చంద్రపడియ గ్రామంలో ఏర్పాటు చేసిన విపిఆర్ నేత్ర కంటి వైద్య శిబిరమును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు సాగునీటి సంఘ అధ్యక్షులు వేమూరి దొరస్వామి నాయుడు తెలుగుదేశం పార్టీ మండల క్లో క్లస్టర్ ఇంచార్జ్ పాములపాటి మాల్యాద్రి విపిఆర్ నేత్ర విజయవంతం చేసేందుకు ముందుగా గ్రామంలో ప్రచారం నిర్వహించి ఈ ఉచిత వైద్య శిబిరముకు అధిక సంఖ్యలో ప్రజలు వినియోగించుకునే విధంగా కృషి చేశారన్నారు. వేమిరెడ్డి దంపతులు చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో ప్రయోజనకరంగా ఉపయోగపడుతున్నాయి ఎంతో మందికి నడవలేని వారికి ట్రై సైకిళ్లను అందజేసి వారికి మరో జన్మను ప్రసాదించే విధంగా సేవ చేశారు అన్నారు ప్రస్తుతం జిల్లాలోని జిల్లాలోని మొట్టమొదటిగా ఉదయగిరి నియోజకవర్గం లో అత్యంత వెనుకబడిన పేదలు ఉంటారని భావించి ఈ ప్రాంతంలో విపిఆర్ నేత్ర పేరుతో కంటి వెలుగును ప్రసాదించే కార్యక్రమం శ్రీకారం చుట్టడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న పుణ్యమే అన్నారు ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరెన్నో చేసే విధంగా వేమిరెడ్డి దంపతులకు భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరారు శిబిరానికి విచ్చేసిన వారికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ళజోళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య సొసైటీ డైరెక్టర్ కోడూరు నాగిరెడ్డి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి కంచర్ల శ్రీనివాసులు దాట్ల శ్రీనాథ్‌రెడ్డి తిరుపతి ఆచారి కృష్ణయ్య ఏగినేని శ్రీనివాసులు ఎన్నపల్లి పెంచలరావు ఖాదర్ బాషా తదితరులు ఉన్నారు.

# పొగాకు పంటలో జాగ్రత్తలు తీసుకోవాలి

**వేలం నిర్వహణ అధికారి రాజశేఖర్**



**కలిగిరి, మేజర్‌న్యూస్ :** కలిగిరి పొగాకు బోర్డు పరిధిలోని కృష్ణారెడ్డిపాలెం, శెట్టి పాలెం, జంగాలపల్లి పొగాకు సాగు రైతులను పొగాకు కంపెనీ ప్రతినిధులతో కూడిన మిత బృందం శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ.. క్యూరింగ్ చేసిన పొగాకును నిల్వ చేసే పద్ధతిలో తప్పనిసరిగా రేకుల షెడ్లను వాడాలని ఈ వాతావరణానికి రంగు మారే అవకాశాలు ఉంటాయని తెలిపారు. అదే విధంగా పొగాకు అల్లకం జరిగే ప్రదేశంలో తప్పనిసరిగా తార్పాల్ పట్టలు వాడాలని తెలిపారు అదే విధంగా రైతులు పొగాకు గ్రేడు సమయంలో ప్లాస్టిక్, ఇతర పదార్థాలను కలవకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు. పొగాకు పోర్టు ప్రాంతీయ కార్యాలయం ఆక్షన్ సూపర్డెంట్ సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ.. పొగాకు పంటలో పేనుబంక మరియు పొగాకు మల్లెను ఎక్కువగా గమనించటం జరిగిందని పొగాకు మల్లె నివారణకు ప్రతి సంవత్సరం పంట మార్పిడి చేసుకోవాలని, పేను బంక ను నివారించటానికి క్యాన్ఫిడర్ లేదా ఉల్లాలను పిచికారి చేయవలెనని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో(ఐటిసి) కంపెనీ ప్రతినిధి వెంకట్రావు (జిపిఐ)కంపెనీ ప్రతినిధి శ్రీనివాస్, పోలిశెట్టి కంపెనీ ప్రతినిధి రామాంజనేయులు, ఇతర పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారు పనులు పరిశీలన



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో జరుగుతున్న జాతీయ రహదారి పనులను మున్సిపల్ అధికారులైన డిఈ, కమిషనర్, హైవే అధికారులతో కలిసి శుక్రవారం కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పరిశీలించారు. పట్టణంలోకి వచ్చే జాతీయ రహదారి ఇరుపక్కల డ్రైనేజ్ ఫుట్పాతులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. వర్షపు నీరు ఎక్కడ నిలబడకుండా సజావుగా వెళ్లే విధంగా రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని నాణ్యతలో రాజీ లేకుండా ఉండాలని అలాగే రహదారులు ప్రజలకు వాహనదారులకు ఇబ్బందికరంగా లేకుండా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్య దర్శులకు సర్వేకు సహకరించండి : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ మెంబర్ సర్వేకు ప్రజలందరూ సహకరించి కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను అందజేయాలని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా కోరారు. వార్డు సచివాలయ కార్యదర్శుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సర్వే ద్వారా నగరపాలక సంస్థ పరిధిలోని ఒక లక్ష 87వేల మంది కుటుంబాల సామాజిక, ఆర్థిక వివరాలను నమోదు చేయనున్నామని, సర్వే చేయడానికి ఇంటి దగ్గరకు సచివాలయ సిబ్బంది వచ్చినప్పుడు పూర్తి వివరాలను అందజేసి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం : ఎస్ఐ



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** విద్యార్థులకు క్రమశిక్షణతోపాటు క్రమం తప్పని శిక్షణ అవసరమని పొదలకూరు ఎస్ఐ మహమ్మద్ హనీఫ్ సూచించారు. మండలంలోని ఇనుకుర్తి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తన సొంత ఖర్చులతో విద్యా ఉపకారణాలను అందజేశారు. పాఠశాలలోని విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు, పెన్నులు, పరీక్ష అట్టలు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎస్సై హనీఫ్ ను శాలువాతో సత్కరించారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చేతిపంపుల మరమ్మత్తులకు శ్రీకారం



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని అన్ని గ్రామాలలో చేతి పంపు మరమ్మత్తులకు గురై నీరు రాకుండా ఉంటే అట్టి వాటిని వెంటనే మరమ్మతులు చేసే విధంగా చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో రమణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నీటి సరఫరా- పారిశుద్ధ్య శాఖ ఆధ్వర్యంలో చేతిపంపుల మరమ్మత్తుల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వేసవికాల దృష్ట్యా నీటి ఎద్దడి లేకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. గ్రామాలలో నెలకొన్న నీటి సమస్యలపై ఆర్డబ్ల్యూఎస్ ఏఈ దృష్టికి తీసుకువెళ్తే తక్షణమే మరమ్మత్తులు చేపట్టి పరిష్కార దిశగా చర్యలు చేపడతారన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర వెంకటేష్, రాజారత్నం, తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్‌గా వినోద్ కుమార్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్‌గా ముసునూరు వినోద్ కుమార్ నియమించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తొలిసారిగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్‌ని మర్యాదపూర్వకంగా కలసి, హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ నా మీద చూపించిన ఆప్యాయత, నాపై మరింత బాధ్యతను, పార్టీ పట్ల సేవాభావాన్ని పెంచింది.

# ప్రజలకు ప్రభుత్వానికి మధ్య బీజేపీ జనతా వారధి

● ప్రజా సమస్యల పరిష్కార బాధ్యతమాది
● సన్నపు రెడ్డి సురేష్ రెడ్డి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార బాధ్యతను బీజేపీ చేపట్టిందని ప్రజలకు ప్రభుత్వాకీ మధ్య జనతా వారధి పనిచేస్తుందని ఆర్‌టిసి జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నెల్లూరులోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీ నుంచి గల్లీ వరకు బీజేపీ కార్యకర్తలు ప్రజలకు సేవ చేసేందుకు వారధి నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు అన్ని ప్రాంతాల్లో జనతా పార్టీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలియజేశారు. సురేంద్రరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, సూచనల మేరకు జనతా వారధి (మీ సమస్య.. మా బాధ్యత)లో ఒక కమిటీ ఏర్పాటు చేసి వారు, నాయకులు ప్రజల దగ్గర్నుంచి వినతిపత్రాలు స్వీకరించి వారందరి సమస్యలు అధికారులకు తెలియజేసి పరిష్కరించెందుకు అలాగే విశ్వకర్మ యోజన ద్వారా ప్రజలకు ఉపాధి కల్పించడం ముఖ్య ఉద్దేశం అని తెలియజేశారు. నాయకులు కార్యకర్తలు అందరూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా భారతీయ జనతా పార్టీ పనిచేస్తుందని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని అధికారులకు తెలియజేసి పరిష్కరించడంపార్టీ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ సమావేశంలో గడ్డం విజయ్ కుమార్, అంచిపాకు కమల, కరణం సుభాషిణి, రాజేశ్, మాల్యాద్రి, ఫణి రాజు, రత్నం నాయుడు, పరుశురాం, పైడి మాని సుజన పాల్గొన్నారు.

# నెల్లూరు బీసీ యువనేతకు దీజ్ పార్టీ రాష్ట్రస్థాయి కీలక పదవి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని స్థానిక ప్రెస్ క్లబ్ నందు దీజ్ పార్టీ సభ్యులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీసీవై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ రాష్ట్రస్థాయి కార్యవర్గాన్ని నియమించారు. అందులో నెల్లూరుకు చెందిన బీసీ యువ నేత ఉల్లిపాయ లీలా కృష్ణ యాదవ్ గత 20 సంవత్సరాలుగా బీసీ విద్యార్థినేతగా ఉంటూ బీసీ రాజకీయాలలో చురుకైన పాత్ర పోషించి రాష్ట్రంలో పేరు తెచ్చుకున్న లీలా కృష్ణ యాదవ్‌ను బీసీవై పార్టీ రాష్ట్ర కో కన్వీనర్‌గా నియమించి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నెల్లూరు నందు బీసీవై పార్టీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లీలా కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. రానున్న 2029 సాధారణ ఎన్నికలలో బీసీలు, బహుజనలు, ముస్లిం, మైనారిటీలు చట్ట సభల లోనికి వెళ్లేందుకు నేటి నుండే క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసి రానున్నది బహుజనుల రాజ్యాధికారమే అనే నినాదంతో పనిచేస్తానని అన్నారు. తనను గుర్తించినందుకు రాష్ట్ర అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ రాష్ట్ర పీఏసీ సెంబర్ ఎస్ఎస్ యాదవ్ జిల్లా కన్వీనర్ బుధవారపు బాలాజీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ సెంబర్ సోమ గోపాల్ జిల్లా యూత్ కన్వీనర్ హరినాథ్ యాదవ్ జిల్లా యూత్ కో కన్వీనర్ కొణిదల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### 37 గిన్నిస్ వరల్డ్ రికార్డులతో

# నెల్లూరు ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మాస్టర్ ప్రభాకర్ రెడ్డి

▸ నెల్లూరు నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఓ యోధుడు ▸ మార్షల్ ఆర్ట్స్‌లో ప్రపంచ రికార్డుల మోత

**నెల్లూరు/బారకాసు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా క్రీడా రంగంలో మరో చారిత్రక ఘట్టానికి సాక్ష్యమిచ్చింది. అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ నిపుణుడు, షావోలిన్ యోధ విద్యలో దిట్ట అయిన మాస్టర్ ప్రభాకర్‌రెడ్డి 37 గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. తన అద్భుతమైన ప్రతిభతో పాటు కఠిన సాధన, అంకితభావంతో ఈ ఘనతను సాధించి నెల్లూరు జిల్లాకు విశేష కీర్తి తెచ్చారు.

**చిన్ననాటి ఆసక్తి నుంచి అంతర్జాతీయ స్థాయికి :** చిన్న వయసులోనే మార్షల్ ఆర్ట్స్‌పై ఆసక్తి పెంచుకున్న ప్రభాకర్ రెడ్డి, కరాటే, కుంగ్‌ఫూ, షావోలిన్ మార్షల్ ఆర్ట్స్‌లో విశేష ప్రావీణ్యం సంపాదించారు. చైనా షావోలిన్ టెంపుల్‌లో శిక్షణ పొందిన ఆయన, అంతర్జాతీయ స్థాయిలో 6వ డాన్ బ్లాక్ బెల్ట్ సాధించారు. చైనా, జపాన్, థాయ్‌లాండ్, మలేషియా, శ్రీలంక వంటి దేశాల్లో ప్రత్యేక శిక్షణ పొంది ప్రపంచవ్యాప్తంగా తన ప్రతిభను చాటారు.

**రికార్డుల పరంపర :** 2012 నుంచి 2026 మధ్య కాలంలో మాస్టర్ ప్రభాకర్ రెడ్డి వివిధ కఠినమైన మార్షల్ ఆర్ట్స్ విన్యాసాలతో మొత్తం 37 గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించారు.ఒక్క వ్యక్తిగా అత్యధిక మార్షల్ ఆర్ట్స్ రికార్డులు సాధించిన వ్యక్తిగా గుర్తింపు పొందడం విశేషం. ఈ రికార్డులు యువతకు స్ఫూర్తిగా



నిలుస్తున్నాయి.

**విద్యార్థులకు సేవే లక్ష్యం :** ప్రభాకర్‌రెడ్డి ఇప్పటివరకు 1,25,000 మందికి పైగా విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ అందించారు. చిన్నారులు, మహిళలు, యువకులు, పెద్దలు అనే తేడా లేకుండా స్వీయరక్షణపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. మార్షల్ ఆర్ట్స్ లక్ష్యం కేవలం పోరాటం మాత్రమే కాదు, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యం, క్రమశిక్షణ, స్వీయరక్షణ అని ఆయన చెబుతున్నారు.

**అంతర్జాతీయ అనుభవం :** చైనా, జపాన్, థాయ్‌లాండ్, మలేషియా, శ్రీలంక వంటి దేశాల్లో శిక్షణ పొంది అక్కడి మార్షల్ ఆర్ట్స్ పద్ధతులను అవలంబించిన ప్రభాకర్ రెడ్డి, భారతీయ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆయన ప్రతిభకు గుర్తింపుగా అనేక సర్టిఫికెట్లు, అవార్డులు అందుకున్నారు. మహిళలు, పిల్లలకు ప్రత్యేక శిక్షణ

**నెల్లూరులో శిక్షణ కేంద్రం :** ప్రస్తుత సమాజంలో మహిళల భద్రతపై పెరుగుతున్న ఆందోళనను దృష్టిలో పెట్టుకొని, మహిళలకు ప్రత్యేక స్వీయరక్షణ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. అలాగే పిల్లల్లో శారీరక, మానసిక వికాసానికి మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయపడుతున్నారు. నెల్లూరు నగరంలోని మగుంట లేఅవుట్‌లో ఉన్న శ్రీ సాయి కాంప్లెక్స్‌లో మాస్టర్ ప్రభాకర్‌రెడ్డి మార్షల్ ఆర్ట్స్ శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి.

**యువతకు స్ఫూర్తి :** గ్రామీణ నేపథ్యం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన మాస్టర్ ప్రభాకర్ రెడ్డి ప్రయాణం ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తోంది. క్రీడా రంగంలో కష్టపడి సాధిస్తే ప్రపంచ స్థాయి గుర్తింపు సాధ్యమేనని ఆయన నిరూపించారు. నెల్లూరు జిల్లా గర్వంగా చెప్పుకునే ఈ ఘనతతో మాస్టర్ ప్రభాకర్‌రెడ్డి పేరు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది.



## ఎమ్మెల్సీ పర్వతరెడ్డికి అజ్మీర్ దర్గా ప్రసాదాలు అందజేత



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు వైసిపి సిటీ కార్యాలయంలో వైసీపీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి వైసిపి నగర యువజన విభాగం అధ్యక్షులు, యస్థాని రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్ దర్గా ప్రసాదాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి రాజకీయంగా మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షిస్తూ.. కోటమిట్ట మఖాన్ పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ రెహమాన్ అల్లాకు ప్రత్యేక దువ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

## 36వ డివిజన్‌లో పర్యటించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ స్థానిక 36వ డివిజన్ ఫతే ఖాన్ పేట, పెండెం వారి వీధి, తాంబరం వారి వీధి ప్రాంతాలలో జరుగుతున్న డ్రైన్ కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం పనులను అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతతో నిర్దేశించిన సమయంలో పూర్తయ్యేలా అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. డివిజన్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ పనులను మరింత మెరుగుగా చేపట్టాలని అధికారులకు కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఎస్ఈ రహంతు జానీ, ఈఈ శేషగిరిరావు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పలు డివిజన్లో పర్యటించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా శుక్రవారం స్థానిక 38వ డివిజన్ ఆర్టీసి బస్టాండ్ వెనకవైపు ఉన్న మీసేవ కేంద్రం పరిసర ప్రాంతాలలో పర్యటించారు. స్థానికంగా ఉన్న డ్రైన్ కాలువలలో పూడికతీత పనులను పరిశీలించారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించారు. శానిటేషన్‌కు సంబంధించి అధికారులకు వివిధ సూచనలు జారీ చేశారు. కమిషనర్ నందన్ నగరపాలక సంస్థ పరిధిలోని 40వ డివిజన్ ఈ ఎస్ఆర్ఎం మున్సిపల్ పాఠశాల ప్రాంతంలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ పూర్వపు మేయర్ భానుశ్రీ, ఇంజనీరింగ్ విభాగం ఈఈ శేషగిరిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణంరాజు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వీఎస్‌యూలో జనవరి-2026 సెమిస్టర్ పరీక్షలు

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మొదటి (రెగ్యులర్ అండ్ సప్లిమెంటరీ) జనవరి-2026 సెమిస్టర్ డిగ్రీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈరోజు జరిగిన పరీక్షకు 1083 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 967 మంది హాజరయ్యారు. కాగా 76 మంది గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వాహణాధికారి డా. ఆర్.మధుమతి తెలిపారు.

# అవార్డు గ్రహీతలకు యుటీఎఫ్ ఘన సన్మానం



**మద్రిపాడు, మేజర్‌న్యూస్ :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం పొందిన మద్రిపాడు మండల విద్యాశాఖ కార్యాలయ కంప్యూటర్ ఆప రేటర్ జీ.శ్రీనివాసులు, సీఆర్ఎంటి కస్తూరయ్యలను యూటీఎఫ్ మద్రిపాడు మండల శాఖ అధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ పక్షాన ఘనంగా శుక్రవారం సన్మానించి వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మద్రిపాడు మండల విద్యా శాఖ అధికారులు తిరుపతయ్య, ధనలక్ష్మి మాట్లాడుతూ.. వృత్తి పట్ల వారికి ఉన్న నిబద్ధత, వారి ఉత్తమ సేవలు గురించి ఘనం గా కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మద్రిపాడు మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్, యూటీఎఫ్ సీనియర్ నాయకులు హెచ్.మోహన్‌ప్రసాద్, సాంబ శివారెడ్డి, సుబ్బరాయుడు, మారుతి కేశవరెడ్డి, యూటీఎఫ్ నాయకులు చంద్రమోహన్, గురుస్వామి, బాలగురవయ్య, ఎన్.వెంకటేశ్వర్లు, రఫీచాంద్ బాషా, వెంకటరెడ్డి, దొంతు రత్నయ్య, సురేష్, పీర్ అహ్మద్, సంపూర్ణమ్మ, విజయలక్ష్మి, అనిత, లక్ష్మి, ఉపాధ్యాయ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# పాడి, జీవాల వారికి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పశు సంవర్ధక శాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను పాడి, జీవాల యజమానులకు అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఉదయగిరి పశు వైద్యశాల సహాయ సంచాలకులు ఎస్. శశిధర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సీతారామపురం, ఉదయగిరి మ ండలాలకు చెందిన పశు వైద్యులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూగజీవాలకు సీజనల్లో వచ్చే వ్యాధులపై పోషక లకు అవగాహన కల్పించి ముందస్తుగా టీకాలు వేయాలన్నారు. సిబ్బంది పోషకులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. పశు పోషణలో శాస్త్ర సాంకేతికతను జోడిస్తూ ఉన్నతంగా ఆలోచించే రైతులను చాంపియన్ రైతులు ఎంపిక చేయాలన్నారు. వారితో తరుచూ సమావేశాలు నిర్వహిస్తూ మరింతమంది రైతులను ఛాంపియన్ రైతులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు ఎస్వీఎస్ రాఘవేంద్రశర్మ. అనూష, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వేను త్వరిత గతిన పూర్తి చేయండి

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** యూనిఫైడ్ ఫ్యామిలీ మెంబర్ (సమగ్ర కుటుంబ) సర్వేను త్వరిత గతిన పూర్తి చేయాలని చేయాలని జిల్లా జెడ్పీ సీఈవో ఎల్.శ్రీధర్ రెడ్డి తెలిపారు శుక్రవారం ఏఎస్ పేటలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎంపిడిఓ కార్యక్రమంలోని రికార్డులను పరిశీలించారు. అలాగే శానిటేషన్‌పై ఆరా తీశారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సచివాలయం సిబ్బందితో యుఎఫ్ఎస్ సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రసన్న కుమారి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రైల్వే ఉద్యోగి అనుమానాధస్పద మృతి

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండలం రుద్రకోట గ్రామంలో రైల్వే ఉద్యోగి అడవిరాజ్ పాలెం రైల్వే గేట్ మేనగా పనిచేయుచున్నారు. అయితే అందిన సమాచారం మేరకు కుటుంబంలో వచ్చిన విభేదాల వలన ఈ హత్య జరిగిందొచ్చునండి అనుమానం వ్యక్తం చేశారు. అంతేకాకుండా మృతదేహం మీద కత్తితో పొడిచినట్లు ఘాట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతులు నాగరాజును ఎక్కడో బయట ప్రదేశంలో హత్య చేసి అర్ధరాత్రి ఎవరు లేని సమయంలో తన ఇంట్లో మంచం మీద పడుకోబెట్టి వెళ్లి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున గ్రామస్తులు. అందిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నెల్లూరు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో దర్గా మిట్ట వాటర్ ట్యాంక్ నుండి పద్మావతి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రూరల్ అధ్యక్షులు ఎం.సుధాకర్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రూరల్ కార్యదర్శి ఏ.దేశమూర్తి మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, సమ్మె కాలం జీతం చెల్లించాలని, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలు నిండాయి అనే కారణంతో ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా అర్ధాంతరంగా ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారు. గత సమ్మె కాలపు హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కే.పెంచల నరసయ్య, జిల్లా కార్యదర్శి ఆర్ఎం సునీల్, నాగేశ్వరరావు, నాగరాజమ్మ, వెంకటమ్మలు పాల్గొన్నారు.

## విజ్ డమ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు ఎంపికైన కంపసముద్రం వాసి



**మద్రిపాడు, మేజర్‌న్యూస్ :** మద్రిపాడు మండలం కంప సముద్రం గ్రామానికి చెందిన మున్నెల్లి శివశంకరయ్య అమెరికన్ విజ్ డమ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌కు ఎంపికయ్యారు. ప్రస్తు తం వీరు అనంతసాగరం మండలం చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేయుచున్నారు. దారంతో వివిధ దేవతా ప్రతిమలు, జాతీయనాయకుల ప్రతిమలు ఎంతో కళాత్మకంగా తయారు చేసినందుకు గాను వారిని ఈ అవార్డ్‌కు ఎంపిక చేసినట్లు ఆ సంస్థ ప్రతినిధులు మెయిల్ ద్వారా తెలియజేశారు. ఈనెల 28 వ తేదీన తమిళనాడులోని హోసూరు నందు వారికి ఈ అవార్డును ప్రధానం చేయనున్నారు.

# ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసరుగా పదోన్నతి పొందిన గుండాల నరేంద్రబాబు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** వృత్తి రీత్యా వీరు స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయులుగా మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్, వెంగళరావు నగర్ నెల్లూరు నందు పనిచేస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో 28 సంవత్సరాల ఏడు మాసాలు పూర్తి చేసుకున్నారు. 09 ఆగస్టు 2012 నుంచి 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ నెల్లూరు నందు కేర్ టేకర్ ఆఫీసర్‌గా 27 అక్టోబర్ 2013 వరకు సేవలందించారు. 28 అక్టోబర్ 2013 నుంచి థర్డ్ ఆఫీసర్ హోదాలో 01 డిసెంబర్ 2021 వరకు విశేషసేవలందించారు. 02 డిసెంబర్ 2021 నుంచి సెకండ్ ఆఫీసర్ హోదాలో తన వంతు సామాజిక బాధ్యతగా సమాజాన్ని చైతన్య పరిచే పలు ర్యాలీలు అవగాహన కార్యక్రమాలు చేపట్టి, పర్యావరణ పరిరక్షణ కొరకు మొక్కలు నాటి పెంచి పెద్దచేశారు. పునీత్సాగర్ అభియాన్, స్వచ్ఛతాహి సేవ, స్వచ్ఛభారత్ అభియాన్, స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర, జాతీయ ఓటర్ల దినోత్సవం, జాతీయ బాలిక దినోత్సవం, జాతీయ యువజన దినోత్సవం, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి, ప్రపంచ నదుల దినోత్సవం, అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం, ఇండియన్ కోస్ట్ గార్డ్ డే, వరల్డ్ ఫస్ట్ ఎయిడ్ డే, గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి, ఇందిరా గాంధీ జయంతి, జాతీయా ఏకతా దివస్, కార్గిల్ విజయ్ దివస్, ఎన్సిసి డే, ఇండియన్ నేవీ డే, ఏక్ గంట ఏక్ దిన్ శ్రమదాన్ కార్యక్రమం, వరల్డ్ ఎయిడ్స్ డే ర్యాలీ, వరల్డ్ క్యాన్సర్ డే ర్యాలీ, ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన నేపథ్యంలో సైనికులకు సంఘీభావం తెలుపుతూ నిర్వహించిన ర్యాలీ, ఆపరేషన్ సింధూర్ అవగాహన సదస్సు, వందేమాతరం జాతీయ గేయం రచించబడి 150 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో నిర్వహించిన కార్యక్రమం, యాంటీ టొబాకో డే, యాంటీ డ్రగ్స్ డే, రహదారి భద్రత వారోత్సవాల ర్యాలీ, ఫిట్ ఇండియా 3 కి.మీ.రన్, సాయిధర్ దళాల పతాక దినోత్సవ నిధి విరాళాల సేకరణ, డిజాస్టర్ మేనేజ్మెంట్, కేరళలో సంభవించిన ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో 77,000 ప్రజల నుంచి విరాళాలు సేకరించి కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి అప్పటి నెల్లూరు జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు ద్వారా డిడి రూపంలో పంపించారు. నిత్యం ప్రజలను చైతన్య పరుస్తూ తన విశిష్ట సేవలు ద్వారా జిల్లా అధికారుల ప్రజల మన్ననలు పొందిన గుండాల నరేంద్రబాబు ఎన్సిసి క్యాడేట్లలో దేశభక్తి సేవా భావం క్రమశిక్షణ జాతీయ సమైక్యత పోరాటపటిమ, సహకార గుణం నాయకత్వ లక్షణాలు, శ్రమ విలువ మొదలైన లక్షణాలను ఎన్‌సీసీ అధికారిగా చక్కటి శిక్షణనిస్తూ వారిని భావి భారత సైనికులుగా తీర్చిదిద్దుతున్నారు. పలు సందర్భాలలో జిల్లా ప్రముఖులతో జిల్లాఉన్నతాధికారులతో నరేంద్రబాబు చేస్తున్న పలు సామాజిక సేవా కార్యక్రమాలలో తన వంతు భాగస్వాములై విశిష్ట సేవలు అందజేసి అధికారుల అనధికారుల మన్ననలు పొందారు. ఎన్‌సీసీ ఆఫీసరుగా వీరు అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల ఎన్సిసి డైరెక్టరేట్ స్థాయిలో ఎన్‌సీసీ బెస్ట్ ఆఫీసర్ అవార్డును 2024-25 సంవత్సరానికి గాను హైదరాబాదులోని ప్యారీసన్ డిఫెన్స్ గ్రౌండ్ నందు నిర్వహించబడిన ఎన్సిసి దినోత్సవ వేడుకల్లో ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమడోర్ వి.మధుసూదన్‌రెడ్డి నుంచి 24 నవంబర్ 2024న అందుకోవడం వీరి విశిష్ట సేవలకు నిదర్శనం.భారత ప్రభుత్వం రక్షణ మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ఆధారంగా ప్రస్తుతం సెకండ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న గుండాల నరేంద్రబాబు 08 నవంబర్ 2025 నుంచి ఫస్ట్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారని 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ, నెల్లూరు లెఫ్టనెంట్ కమాండర్ గణేష్ గొదన్గవే కమాండింగ్ ఆఫీసర్ నేడు ఉత్తర్వులు జారీ చేశారని నరేంద్రబాబు ఓ ప్రకటనలో తెలియజేశారు. తెలుగు ఉపాధ్యాయినిగా విద్యార్థుల్లో దేశభక్తి భావాన్ని తెలుగుభాష ఎడల అభిమా నాన్ని అభిరుచిని ఆసక్తిని అనురక్తిని పెంపొందిస్తూ వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతూ విద్యాశాఖ అధికారుల తల్లిదండ్రుల విద్యార్థుల మన్ననలు అందుకున్నారు. ఈ నేపథ్యంలో వీరు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని 2022లో సెప్టెంబర్ 5వ తేదీన ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా విజయవాడలో అందుకున్నారు. అంతేకాకుండా గణతంత్ర దినోత్సవ పురస్కారాలను అప్పటి జిల్లా కలెక్టర్లు 2011లో కే.రామ్ గోపాల్ ఐఏఎస్, 2020లో ఎం.వి. శేషగిరి బాబు ఐఏఎస్, 2024 లో ఎం.హరి నారాయణన్ ఐఏఎస్ 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో గుండాల నరేంద్రబాబు విభిన్న రంగాలలో అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా ప్రస్తుత జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా గణతంత్ర దినోత్సవ పురస్కారాన్ని అందజేసి అభినందించారు. నేడు పదోన్నతి పొందిన ఉత్తర్వులు అందిన సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సి.మంజులవాణి, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ లెఫ్టెంట్ కమాండర్ గణేష్ గొదంగవే, ఇతర ఎన్సిసి అధికారులు నరేంద్రబాబుకు అభినందనలు తెలియజేశారు.

# హెచ్‌ఆర్‌ఎంలో ఏఐపై జాతీయ స్థాయి వర్క్‌షాప్

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** మారుతున్న సాంకేతిక ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు, పరిశోధకులు ఆధునిక నైపుణ్యాలు సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలోని బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో 'హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌లో కృత్రిమ మేధస్సు (ఏఐ)' అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వ ప్రధాన మంత్రి ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ (పిఎం- ఉష) పథకం సహకారంతో నిర్వహించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. కె.సునీత జ్యోతి జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఉద్యోగ నియామకాలు, శిక్షణ కార్యక్రమాలు, పనితీరు మూల్యాంకనం వంటి హెచ్‌ఆర్ విభాగాల్లో కృత్రిమ మేధస్సు కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇలాంటి జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లు విద్యార్థులు, పరిశోధకులు పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌కు ప్రముఖ ఏఐ, బిహేవియరల్ సైన్స్ నిపుణుడు, 'హ్యూమలిటిక్స్ సమస్త' వ్యవస్థాపకుడు వినోద్ నాయర్ రిసోర్స్ పర్సన్‌గా హాజరై కీలక ఉపన్యాసం ఇచ్చారు. హెచ్‌ఆర్ రంగం సంప్రదాయ విధానాల నుంచి డేటా ఆధారిత విధానాల వైపు మారాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. అలాగే ఉద్యోగుల ప్రవర్తనా విశ్లేషణ, పనితీరు అంచనాలు, నిర్ణయ ప్రక్రియల్లో ఏఐ వినియోగం వల్ల వచ్చే విప్లవాత్మక మార్పులను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన పిఎం-ఉష కోఆర్డినేటర్ ఆచార్య జి.విజయనంద్ కుమార్‌బాబు,



ఉన్నత విద్యా సంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధికి పీఎం ఉష పథకం ఎంతో తోడ్పడుతోందని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులను రూపొందించడం ద్వారా విద్యార్థుల ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని అన్నారు. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగ డీన్ ఆచార్య సుజా ఎస్.నాయర్ మాట్లాడుతూ.. బోధన, పరిశోధన రంగాల్లో ఏఐ వినియోగం వల్ల కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని, అంతరశాఖీయ పరిశోధనలకు ఇది బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.హెచ్. విజయ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. జి.సాయి శ్రవంతి, డా. జె.విజేత, కో-కోఆర్డినేటర్ ఎ.గాయత్రి, డా. పి.శ్రీవల్లి, కోట నీలమణి కాంతతో పాటు పెద్ద సంఖ్యలో అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు పాల్గొని వర్క్‌షాప్‌ను విజయవంతం చేశారు.

## మర్రిపాడులో జేవీవీ వక్త 2026 పోస్టర్ ఆవిష్కరణ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మర్రిపాడు విద్యా వనరుల కేంద్రంలో జన విజ్ఞాన వేదిక వక్త పోస్టర్ను ఎంఈఓ తిరుపతయ్య ఆవిష్కరించారు. గత 37 సంవత్సరాలుగా వివిధ రంగాలలో తన వంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తూ జనవిజ్ఞాన వేదిక ముందుకు వెళుతున్న విషయం అందరికీ తెలిసిన విషయమేనని అన్నారు. విద్య ఆరోగ్యం పర్యావరణం వ్యవసాయం మహిళ సాధికారిత మొదలగు విభిన్న రంగాలలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ తెలుగు ప్రజల మన్ననలు పొందినన్నారు. మారుతున్న ప్రపంచ మానవ వనరుల అవసరాలతో విద్యార్థినీ విద్యార్థులు విద్యాబుద్ధులతోపాటుగా చక్కగా మాట్లాడడం అత్యంత కీలకమన్నారు. ప్రపంచంలో ఏ దేశంలోనైనా ఏ రంగంలోనైనా రాణించగల శక్తిని ఇచ్చేందుకు విద్యార్థుల భవితకై నిరంతరం శ్రమించే పాఠశాలలో కళాశాల స్థాయిలో ఈ వక్త పోటీలను నిర్వహించడానికి తోడ్పాటు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి మండల ఉపాధ్యక్షులు కుంభగిరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# 22న చలో మంగళగిరి, చేనేత గర్జన' జయప్రదం చేయండి



**మనుబోలు, మేజర్‌న్యూస్ :** ఫిబ్రవరి 22వ తేదీ మంగళగిరి నందు రాష్ట్రవ్యాప్త చేనేత కార్మిక సంఘాలు, సహకార సంఘాల, ఆధ్వర్యంలో జరగబోయే 'చేనేత గర్జన' మహా సభను జయప్రదం చేయుట కొరకు మనుబోలు మండలం మడమనూరు గ్రామంలోని ప్రతి చేనేతఇంటికి కరపత్రం అందజేశారు. మనుబోలు గ్రామంలోని చౌడేశ్వరి గుడి నందు శుక్రవారం చేనేత పెద్దలు, చేనేత కార్మికులు అందరూ కలిసి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు కటికాల వెంకటేశ్వర్లు, పముజుల శంకరయ్య, చింత గింజల సుబ్రహ్మణ్యం, పముజుల హరి, చొప్ప వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చేనేతలకు న్యాయమైన డిమాండ్ల సాధనకై మేము చేపట్టిన ఈ చేనేత గర్జన కార్యక్రమంను కరపత్రం రూపంలో ప్రతి చేనేత కార్మికుల కుటుంబాల వద్దకు తీసుకెళ్లి మహాసభను జయప్రదం చేయమని కోరడం జరుగుతుందని తెలియజేశారు. చేనేత కార్మికులకు గత ప్రభుత్వశీ ఇస్తున్న నేతన్న నేస్తం పథకం 24 వేల రూపాయలను ఈ ప్రభుత్వం 25 వేలకు పెంచి ఇస్తానని హామీ ఇచ్చిందని కానీ ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని నేతన్న నేస్తం పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రతి చేనేత కార్మికునికి 50 ఏళ్లకు పెన్షన్ సౌకర్యం కల్పిస్తా నని హామీ ఇచ్చారని, ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తామని చెప్పారని, ఇప్పటివరకు కార్యాచరణ జరగలేదని తెలియజేశారు. చేనేత వస్త్ర ఉత్పత్తికి వినియోగించే చిలపనూలు జరీపట్టు, రంగులు, రసాయనాలు, చేనేత వస్త్రాల పైన భారత రాజ్యాంగా అధికరణ ఆర్టికల్ 43కి వ్యతిరేకంగా విధించిన జీఎస్టీని తక్షణమే రద్దు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు, మడమనూరు గ్రామ కార్మికులు పడవల క్రిష్టయ్య,బాలాజీ నాగరాజు, బొగ్గుల వెంకటేశ్వర్లు, మనుబోలు గ్రామ చేనేత కార్మికులు పముజుల వెంకటేశ్వర్లు, వార్ల శ్రీనివాసులు, కన్నా సుబ్రహ్మణ్యం, వెంకట శేషయ్య,కన్నా వెంకటకృష్ణయ్య, సీతా వెంకటకృష్ణయ్య, వెంకటేశ్వర్లు కల్లూరు శ్రీహరి, వార్ల వెంకటరమణయ్య, కన్నా వెంకటరమణయ్య, కల్లూరు వెంకటేశ్వర్లు పేరిసేట్ల వెంకటకృష్ణయ్య తదితరులు, పాల్గొన్నారు.

## పొదర్తి నాగరాజును పరామర్శించిన జబర్దస్త్ ఆర్టిస్టులు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో వ్యాపారస్తులు, పాత్రికేయులు అయినా పొదర్తి నాగరాజు అనారోగ్యంతో గుండె చికిత్స చేయించుకుని ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు విషయం తెలుసుకున్న జబర్దస్త్ ఆర్టిస్టులైన అప్పారావు, గడ్డం నవీన్‌లు మరి గృహానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం అనారోగ్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. నిండు నూరేళ్ళ దేవుడు మీకు మీ కుటుంబానికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కమెడియన్ ఆర్టిస్టులు ఆశీర్వదించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. డాక్టర్లు ఇచ్చిన సలహాలు తప్పక పాటించాలని టైం కు మందులు వాడాలని తెలిపారు. అనంతరం జబర్దస్త్ ఆర్టిస్టులైన గడ్డం నవీన్, అప్పారావును శాలువాతో సత్కరించారు. అంతే అభిమానంతో పొదర్తి నాగరాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో పొదర్తి ప్రసాదరావు, ఉదయ్ కుమార్, కావలి చిన్న జీయర్ స్వామి, కె. శ్రీనివాసచార్యులు, గాదంశెట్టి వేణుగోపాల్, ఏల్చూరి రవి, సువర్ణ శ్రీనివాసులు, పెట్టి కాన్ రమేష్,పెసల పవన్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** యువజన సర్వీసులు శాఖ (సెట్నెల్), కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, (పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బుజబుజనెల్లూరులోని డివిఎన్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శేషు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు పర్సనాలిటీ డెవలప్మెంట్ అండ్ క్యారియర్ కౌన్సిలింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ పి.సురేష్ బాబు పాల్గొని మాట్లాడుతూ.. యువత తమ భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించుకొని వాటిని సాధించేందుకు గాను 21 రోజులపాటు వారు ఎంచుకున్న లక్ష్యాన్ని పేపర్ పై రాసి పదేపదే స్మరించుకుంటే వారు అనుకున్న లక్ష్యాలను సునాయాసంగా చేరుకోగలరని తెలియజేశారు. అనంతరం ముఖ్య కార్యనిర్వహణాధికారి, సెట్నెల్, నెల్లూరు ఎ.నాగేశ్వర రావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ కెరీర్‌ను సాధించాలంటే కృషి, పట్టుదలతోపాటు వారికి ఇష్టమైన రంగాలను ఎంపిక చేసుకుని ఒక ప్రణాళికబద్ధంగా ప్రయత్నించినవలెనని తెలిపారు. ఈ కార్యక్రమంలో శేషు స్కూల్ కరస్పాండెంట్ ఆదిశేషు, జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, ఉపాధ్యాయులు హజరత్తయ్య, సెట్నెల్ మేనేజర్ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ గయాస్ అహ్మద్, జిల్లా పీహెచ్‌పీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి విద్యుత్ అంతరాయానికి చింతిస్తున్నాం..

- సహృదయులైన వినియోగదారులు సహకరించాలి
- నెల్లూరు టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మన్నేపల్లి శ్రీధర్



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ.. నెల్లూరు టౌన్ విద్యుత్ ఆపరేషన్ డివిజన్ పరిధిలో శనివారం తాత్కాలికంగా ఏర్పడనున్న విద్యుత్ అంతరాయానికి చింతిస్తున్నామని, సహృదయులైన వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మన్నేపల్లి శ్రీధర్ కోరారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలోని వివరాలిలా ఉన్నాయి. 33/11 కె.వి. రాజేంద్ర నగర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ లకు అడ్డంకిగా మారిన చెట్లకొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున గుప్తా పార్క్, ములుమూడి బస్టాండ్, అగ్ని పేట, చిన్న బజార్, జ్ఞానమ్మ తోట, సంత పేట, రామిరెడ్డి వీధి పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8:00 నుండి మధ్యాహ్నం 01:00 వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఈ మార్పును వినియోగదారులు గమనించి సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, అత్యవసర విభాగం వారు ముందస్తుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు.

## గడ్డంవారిపల్లి ఉన్నత పాఠశాల్లో సరస్వతి పూజ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గడ్డంవారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదవతరగతి విద్యార్థులు చదువుల తల్లి సరస్వతి దేవి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి దేవి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా విద్యార్థులుఉపాధ్యాయులు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం ఏ మాలకొండయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ1 టి వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. 10 విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం ఫేర్వెల్ కార్యక్రమము నిర్వహించారు. గత సంవత్సరం 10వ తరగతిలో ఉత్తమ మార్కులు డి.ప్రవంతి, జి.భరద్వాజ్, కే.లక్ష్మిలకు పివిఆర్ చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ పులుగుల్ల వెంకటరాయుడు బ్రదర్స్ నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఈ కార్యక్రమంలో జి.శ్రీనివాసులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే, జేసీ

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండలం కొత్తపల్లి గ్రామంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లతో కలసి కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి శుక్రవారం ప్రజాదర్బార్‌లో పాల్గొన్నారు. రైతులకు పాస్ పుస్తకాలు అందించారు. అనంతరం ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతనంగా ప్రభుత్వం ముద్రించి ఇచ్చిన పాస్ పుస్తకాల్లో క్యూఆర్ కోడ్ భూమి విస్తీర్ణం లాంగిట్యూడ్– లాటిట్యూడ్ వివరాలు 8దిక్కుల హద్దులు పొందుపరచడం ద్వారా భూమికి సంబంధించిన సమగ్ర సమాచారం ఒకే పత్రంలో లభిస్తుందని తెలిపారు. ఇకపై బ్యాంకు లోన్ కోసం అధికారులు రైతుల పొలాలకు రావాల్సిన అవసరం లేకుండా క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తేనే భూమి వివరాలన్నీ స్పష్టంగా కనిపిస్తాయని తెలిపారు. దీనివలన బ్యాంకు రుణ ప్రక్రియ సులభతరంగా రైతులకు సమయం ఖర్చు రెండు మిగులు గలవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ కాలంలో పాస్ పుస్తకాలపై వ్యక్తిగత ఫోటోలు ముద్రించడానికి వ్యతిరేకించారు. ప్రజల ఆస్తులపై రాజకీయ ముద్రలు ఉండకూడదని స్పష్టం చేశారు. రాజ చిహ్నంతో రాజముద్ర కలిగిన కొత్త పాస్ పుస్తకాలను ప్రవేశపెట్టినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు రారు గతంలో సమాన భాగాలుగా ఉన్న భూములు కొలతల తేడాల వల్ల ఏర్పడిన సమస్యలను సరిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక అవకాశం కల్పించిందని తెలిపారు. రైతులు తమ పాస్ పుస్తకాల్లో ఏమైనా పొరపాట్లు గమనిస్తే వెంటనే తహసిల్దార్ కార్యాలయం లేదా సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకుని సవరణలు చేయించుకో



వాలని వారు సూచించారు. భవిష్యత్తులో భూమి కొనుగోలు అమ్మకాలాన్ని ఇదే రికార్డు ఆధారంగా జరుగుతాయని తెలిపారు. కొత్త పాస్ పుస్తకాలు తెలుగుతోపాటు ఇంగ్లీష్‌లో కూడా ముద్రించడంతో ఇతర రాష్ట్రాల వారు లేదా భాష తెలియని బ్యాంక్ అధికారులు సైతం భూమి వివరాలు సులభతరంగా అర్థం చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. కొత్తపల్లి సహా పరిసర పంచాయతీలకు సాగునీరు అందించే దిశగా గ్రావిటీ విధానంలో కాలువల ద్వారా నీళ్లు తీసుకురావడానికి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే లిఫ్ట్ ఇరిగేషన్ కూడా పరిశీలిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామంలో ఇప్పటికే సిమెంట్ రోడ్లు నిధులు మంజూరయ్యాయని, మిగిలిన రహదారులు త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, తాసిల్దార్ పి. శ్రావణ్ కుమార్ రెవిన్యూ అధికారులు, గ్రామ పెద్దలు, టిడిపి నాయకులు కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# రైతుల్లో భయాన్ని పోగొట్టాము..

## సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టాన్ని కూటమి ప్రభుత్వం తొలగించి రైతుల్లో భయాన్ని పోగొట్టిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే ముత్తుకూరు మండల కేంద్రానికి విచ్చేసి రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నీలం మల్లికార్జునయాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పార్టీ జనరల్ సెక్రటరీ మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఈదురు రామ్మోహన్ రెడ్డి, మునుకూరు రవికుమార్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, పార్టీ నాయకులు పల్లంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కొత్తపల్లి రమేష్ కుమార్ శర్మ, విష్ణువర్ధన్‌రావు, సతీష్ నాయుడు, అక్కయ్య గారి ఏడుకొండలు, శంకర్, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పరిపాలనలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రీ సర్వే చేసి రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశామన్నారు. గత ప్రభుత్వంలో రైతుల భూములు పెత్తనం రిటైర్డ్ అధికారుల చేతుల్లో పెట్టారని తద్వారా రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని ఎమ్మెల్యే సోమిరెడ్డి అన్నారు. ముత్తుకూరు మండలంలో 5470 పాసు పుస్తకాలు రైతులకు ఇవ్వాల్సి ఉండగా 50 శాతం మేరకు పూర్తి చేశామని ఎమ్మెల్యే తెలిపారు. ఏదైనా పొరపాట్లు జరిగి ఉన్న ఎడల అధికారులు సరిచేసి రైతులకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా అమ్మవారికి ఉద్యాపన పూజ



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం విశేషంగా రాహు కాల ఉద్యాపన పూజలో శ్రీ అమ్మ వారికి చీరజాకెట్టు, 108 నిమ్మకా యల మాలలు సమర్పించారు. రాహుకాల దీపాలు చేసిన శ్రీ అమ్మ వారిని దర్శించుకొన్నారు. ప్రతి శుక్రవారం భక్తుల విరాళముల ద్వారా దేవస్థానం తరవున అన్నదాన కార్యక్రమం జరుగుచున్నది. ఈ శుక్ర వారం మూడు వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. అన్నదాన కార్యక్రమంను భక్తులు ఇచ్చిన విరాళములు ద్వారా నిర్వహిం చుట జరుగచున్నది. సాయంత్రం వేదపారాయణం, సంధ్యా మేళం, రాత్రి కుంభ హారతులు, పల్లకీ సేవ కార్య క్రమములు జరిగినవి అని సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు.

# టౌన్ ప్లానింగ్ విభాగం పై సమీక్ష



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ పట్టణ ప్రణాళిక విభాగం వారాంతపు సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇన్చార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. నగరపాలక సంస్థకు సంబంధించిన దుబార ఖర్చులను దాదాపు తగ్గించేసామని తెలిపారు. కార్పొరేషన్‌కు ఆదాయం తీసుకువచ్చే ఎల్ఆర్ఎస్, బిపిఎస్ పరకాలపై ప్లానింగ్ కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. బిపిఎస్, ఎల్ఆర్ఎస్ పథకాల అమలు కోసం అందుకున్న దరఖాస్తులను ఆన్లైన్లో పరిశీలించి పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మేయర్ సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ.. బిపిఎస్ పథకంపై అర్హులందరికీ అవగాహన కల్పించి తప్పనిసరిగా దరఖాస్తు చేసుకునేలా ప్రతి ఒక్క ప్లానింగ్ కార్యదర్శి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, టిపిబిఓలు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దుర్గంధం వెదజల్లుతున్న పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

- **పైప్ లీకేజీ కారణంగా అవస్థలు పడుతున్న ప్రయాణికులు**
- **ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు**



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో నడిబొడ్డున ఆర్టీసీ బస్టాండు నిర్మితమై ఉన్నది బస్టాండు ఆవరణ లోపల ఎక్కడ చూసినా దుర్గంధం వెదజల్లుతున్నది. దీనికి సంబంధించిన ఆర్టీసీ డిఎం నామమాత్రంగానే ఉంటున్నారు. కానీ అక్కడ పరిస్థితులను కానీ ఆ ప్రదేశాలను కానీ పర్యవేక్షించిన దాఖలు లేవు డ్యూటీకి రావడం కూర్చోవడం, సాయంకాలం వెళ్లడం తప్ప మరి ఏవి పట్ట, పట్ట నట్టుగా కావలి ఆర్టీసీ డిపో మేనేజర్ వ్యవహరిస్తున్న తీరు ఇది, వివరాల్లోకి వెళితే సుమారు నెలరోజుల నుంచి బస్సులు బయటకు వెళ్ళు మార్గంలో పైపు లీకేజీ వచ్చి నీరు ఒక నదిలాగా ప్రవహిస్తున్నది. దీని వలన అనేకమంది ప్రయాణికులు, పాద చార్యులు, ద్విచక్ర వాహనదారులు అలాగే వృద్ధులు బస్సు ఎక్కాలన్న ఎంతో ఇబ్బందులు పడుతున్న వైనం. ఈ విషయం పై కనీసం ఆర్టిసి డిఎం పట్టించుకున్న దాఖలాలు లేవు. పరిశుభ్రత కాదు ఇక్కడ అపరిశుభ్రత, వ్యర్థాలు, దుర్వాసన ఇంకా ఇక్కడ పరిస్థితులు ఉన్నత అధికారులు పర్యవేక్షిస్తే ఎన్నో అవకతవకలు కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే పైపు లీకేజీ కారణంగా ఇటీవల కాలంలో అక్కడ ప్రాంతాన్ని జెసిబితో తవ్వడం, వదిలేయడం జరిగింది. మరమ్మత్తులు చేపట్ట పోవడంపై ప్రయాణికులు, వ్యాపారస్తులు ఎంతో ఇబ్బందులకు, వేదనకు గురవుతున్నారు. ఉన్నత అధికారులైన పట్టించుకోని ఈ సమస్యను పరిష్కరించాలని, అలాగే ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న అపరిశుద్ధత అంతయు తొలగించి పరిశుద్ధమైన వాతావరణాన్ని నెలకొల్పే విధంగా ఉండాలని, అలాగే ఈ అపరిశుభ్రత వలన ప్రయాణికులకు చిన్న పిల్లలకు ముఖ్యంగా వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున నిపుణులు, నెటిజెన్లు, ప్రయాణికుల మనోభావాలను వ్యక్తపరుస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు ఆర్టీసీ బస్టాండ్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** దేశవ్యాప్తంగా ఈనెల 12వ తేదీన నిర్వహించతలపెట్టిన సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకుడు జి.వి.శివప్రసాద్ కోరారు. శుక్రవారం ఆత్మకూరులోని సిపిఎం కార్యాలయంలో సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను సిఐటియు, అనుబంధ సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ.. కార్మికసంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెలో సిఐటియు, అనుబంధ సంఘాల కార్మికులంతా అధికసంఖ్యలో పాల్గొనాలని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్మికులు ఉద్యమాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్‌కోడ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఈకోడ్‌లు కార్మికులకు వ్యతిరేకంగా ఉండే విషయాన్ని అందరూ గుర్తించాలని, పాతచట్టాల పునరుద్ధరణకు ఉద్యమించాలని ఆయన కోరారు. శ్రామికుల కష్టాన్ని కార్పొరేట్‌యజమానులకు ధారపోసేలా కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా ఈనెల12వతేదీన సమ్మె నిర్వహించనున్నామన్నారు. లేబర్‌కోడ్‌లు అమలులోకివస్తే కార్మికులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని ఆయన వివరించారు. స్వాతంత్ర్యానంతరం కార్మికులు పోరాటాల ద్వారా 29కార్మికచట్టాలను సాధించుకున్నామన్నారు. ఈ హక్కులతో కార్మికులు, ఉద్యోగులు స్వేచ్ఛగా తమ సేవలందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. లేబర్‌కోడ్‌లు



అమలైతే కార్మికుల హక్కులకు భంగం వాటిల్లనుందని శివప్రసాద్ పేర్కొన్నారు. నూతన చట్టాల ప్రకారం సంఘాలు ఏర్పాటు చేసుకోవాలన్నా, ధర్నా చేయాలన్నా యాజమానుల ఆదేశాలు జవదాటకూడదని, యజమానులు కార్మికులను ఎప్పుడైనా తొలగించే అధికారాలు వారికి ఉంటాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ అధ్యక్షుడు కె.డేవిడ్‌రాజు, సిఐటియు జిల్లా నాయకులు కొండమూరు హజరత్తయ్య, మండల శాఖఅధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్యలు ప్రసంగించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కమిటీ ప్రధానకార్యదర్శి పి.రాధ, అధ్యక్షురాలు కె.రమణమ్మ, వైద్యఉద్యోగుల సంఘ నాయకుడు షేక్ జిలానీ, సిఐటియు మండల కార్యదర్శి ఏ.మహేష్, విద్యుత్ ఉద్యోగుల సంఘ నాయకుడు టి.పెంచలరావు, ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు మహమ్మదాలీ, భాస్కర్, మున్సిపల్ కార్మికసంఘ నాయకులు గోపి, రూబిన్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# రూరల్ అభివృద్ధి పనుల కోసం 236 కోట్ల నిధులు

## నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం 236 కోట్ల రూపాయల నిధులు మంజూరైనట్లు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కాటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొత్తం 200 కిలోమీటర్ల తాగునీటి పైప్‌లైన్లు, అన్ని విలీన గ్రామాలలో నిర్మాణం చేయడం జరుగుతుం దన్నారు. అదే విధంగా 41వ డివిజన్ పరమే శ్వరి నగర్‌లో మరియు 30వ డివిజన్‌లో అతిపెద్ద కాలనీ అయిన వైయస్‌ఆర్ నగర్‌లో, 31వ డివిజన్ అక్కచెరువుపాడు, అంబాపురంలో వాటర్ ట్యాంక్‌లు నిర్మాణం చేయడం జరుగు తుందన్నారు. దీనివలన ప్రజలకు త్రాగునీటి సమస్యలు ఉండవు. దీనికోసము 125 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. మరో 111 కోట్లతో 18, 19, 20, 30, 35, 41 డివిజన్‌లలో 51కి.మీ. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేయడం జరుగుతుంది. దీనిద్వారా ప్రజలకు డ్రైనేజ్ సమస్య లేకుండా ఎంతో మేలు చేస్తుందన్నారు. గత వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఆనాటి ముఖ్యమంత్రిని వీటికోసం నిధులు విడుదల చేయమని ఎన్నిసార్లు అడిగినా, నా గొంతు అరిగిపోయింది కానీ ఒక్క రూపాయి నిధులు విడుదల కాలేదని ఆయన పేర్కొన్నారు. నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి వర్యులు పొంగూరు నారాయణ చొరవతీసుకొని ఈ నిధులు విడుదల చేయించినదానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి అడుగులో సహ కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, యువనేత, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కి, జిల్లా మంత్రులు పొంగూరు నారాయణకి, ఆనం రామనారాయణ రెడ్డికి, జిల్లా ఇన్‌ఛార్జ్‌మంత్రి ఫరూక్‌కి, పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, ఎమ్మెల్సీ బీద రవిచంద్రకి, నగర ఇన్‌ఛార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్‌కి, జిల్లా కలెక్టర్‌కి, కమీషనర్‌కి, అధికార యంత్రాగానికి మొత్తం నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఋణపడి ఉంటుందన్నారు.

# లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు పోరాడుతాం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు సిఐటియు పోరాడుతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి కె.హజరతయ్యా, శివప్రసాద్ తెలిపారు ఏఎస్ పేటలో శుక్రవారం సిఐటియు నాయకులు అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం జరి గింది ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్స్ లను ఏర్పాటు చేసిందని తెలిపారు. దాని వల్ల కార్మికుల హక్కులు హరించుకుపోతాయనారు 2025 నవంబర్ నెలలో లేబర్ కోడ్స్ దేశవ్యాప్తంగా అమల్లోకి తెచ్చారని వెల్లడించారు కార్మికుల పని గంటలు 8 గంట నుంచి 12 గంటలకు పెంచారని తెలిపారు. భాజపా ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ధ్వంసం చేసిందని తెలిపారు. రాష్ట్రంలో టిడిపి, జనసేవ, వైకాపా పార్టీ లు లేబర్ కోడ్స్ కు అనుకూలంగా పార్లమెంటులో ఓటు వేశారని చెప్పారు విద్యుత్ సవరణ బిల్లు ను, విత్తన సవరణ బిల్లు ను ఈ బడ్జెట్ లో ఆమోదించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసినట్లు తెలిపారు. నిరసనగా ఈ నెల 12వ తేదీ న దేశ వ్యాప్త సమ్మె జరుగుతుందని అని సిఐటియు శాఖలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు లక్ష్మీపతి ఏఎస్ పేట సిఐటియు మండల కార్యదర్శి షేక్ గయాజ్ మండల అధ్యక్షులు ఓంకార్, సిఐటియు అంగన్వాడీ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సుశీలమ్మ, విజయలక్ష్మి, అనూరాధ, పెంచలరావు, ఏఎస్ పేట సిఐటియూ నాయకులు అస్లాం, నిసార్, కౌలు రైతు సంఘం నాయకులు సుబ్రమణ్యం, విద్యుత్ యూనియన్ నాయకులు. తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా ఎరువుల ప్రయోగశాలలకు ఎంత నిధులు ఖర్చు చేశారు ?

## లోక్ సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్న

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** దేశవ్యాప్తంగా ప్రస్తుతం పనిచేస్తున్న ఎరువుల ప్రయోగశాలల బలోపేతానికి ఎన్ని నిధులు ఖర్చు చేశారని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆరా తీశారు. ఈ మేరకు శుక్రవారం లోక్‌సభలో ఆయన పలు అంశాలపై ప్రశ్నించారు. దేశంలో ప్రస్తుతం పనిచేస్తున్న ఎరువుల పరీక్ష ప్రయోగశాలలు, వాటి సామర్థ్యం, గత ఐదేళ్లలో ప్రయోగశాలలు పరీక్షించిన మొత్తం ఎరువుల నమూనాల సంఖ్య, దేశవ్యాప్తంగా సకాలంలో పరీక్షలు, నాణ్యత అమలును నిర్ధారించడానికి తీసుకున్న చర్యలు, ఖాళీల భర్తీ వివరాలపై వివరాలు కోరారు.

▶▶ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా 84(కేంద్ర ప్రభుత్వం 4, రాష్ట్ర ప్రభుత్వాలు 80) ఎరువుల పరీక్షల ప్రయోగశాలలు ఉన్నాయని, వాటి 2024-25 వార్షిక సామర్థ్యం 1,88,236 అన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 3 ఎరువుల ప్రయోగశాలలు ( అనంతపురం, బాపట్ల, తాడేపల్లిగూడెం) ఒక్కోదాని సామర్థ్యం 3500 అన్నారు.

▶▶దేశవ్యాప్తంగా 2024-2025 సంవత్సరానికి గాను దేశవ్యాప్తంగా ప్రయోశాలల నిర్వహణకు రూ.202.25 కోట్లు మంజూరు చేయగా.. ఇప్పటివరకు ఖర్చు చేయలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని 3 ప్రయోగశాలలకు రూ.8.81 కోట్లు మంజూరు చేశామన్నారు. ఇక ఏపీకి 2020-21లో రూ.8.92 కోట్లు, 2021-22లో రూ.1.68 కోట్లు, 2022-23లో రూ. 4.37 కోట్లు, 2023-24లో రూ.9.52 కోట్లు మంజూరు చేయగా.. రూ. 4.20 కోట్లు ఖర్చు చేశారన్నారు. మిగతా ఏ సంవత్సరంలోనూ ఖర్చు చేసిన దాఖలాలు లేవన్నారు.

▶▶ప్రయోగశాలల్లో ఖాళీలను భర్తీ చేయడానికి తీసుకున్న చర్యలు రాష్ట్రానికి



మారుతూ ఉంటాయని, స్థానిక రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రయోగశాలల లక్ష్యం, సిబ్బంది, ఖాళీలను భర్తీ చేసే విధానాన్ని నిర్ణయించే అధికారం ఉందన్నారు. ఎరువుల సకాలంలో పరీక్ష కోసం, వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ (డీఏ అండ్ ఎఫ్‌డబ్ల్యూ) ఎరువుల నియంత్రణ ఉత్తర్వును నోటిఫై చేసిందని, 1985లో ప్రయోగశాలలకు పరీక్షా ప్రోటోకాల్, విశ్లేషణ పరికరాల సమయ పరిమితిని నిర్దేశించారన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేసిన అన్ని ప్రయోగశాలలు ఎరువుల విశ్లేషణ కోసం ఇలాంటి పరీక్షా ప్రోటోకాల్‌ను అనుసరించాల్సి ఉంటుందని చెప్పారు.

▶▶కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎరువుల నియంత్రణ ఉత్తర్వు,-1985 ప్రకారం రైతులకు పంపిణీ చేసిన ఎరువుల నాణ్యతను తనిఖీ చేయడానికి/నిర్ధారించడానికి ఎరువుల తనిఖీదారులను నియమిస్తాయని, ఎరువులు తయారు చేయబడిన/దిగుమతి చేయబడిన లేదా నిల్వ చేయబడిన, అమ్మకానికి ప్రదర్శించబడిన ఏదైనా ప్రాంగణంలోకి ప్రవేశించి శోధించడానికి ఎరువుల తనిఖీదారులకు అధికారం ఉంటుందన్నారు. నాణ్యత నియంత్రణను ఉల్లంఘిస్తే తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎరువుల నియంత్రణ ఉత్తర్వు,-1985 ఉల్లంఘనకు జరిమానాలు, 3 నెలలు లేదా అంతకంటే ఎక్కువ ఏడు సంవత్సరాల వరకు జరిమానాతో లేదా లేకుండా జైలు శిక్ష విధించవచ్చన్నారు.

# జిల్లా కార్యవర్గంలో మన్నేటికి చోటు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** బీజేపీ జిల్లా కమిటీలో ఉదయగిరి మండలం గగిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన మన్నేటి శ్రీనివాసులుకు జిల్లాకార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. శుక్రవారం నెల్లూరు పార్లమెంట్ బిజెపి అధ్యక్షులు వంశీధర్ రెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు పి.సురేందర్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాపై నమ్మకం తో జిల్లా కార్యవర్గంలో స్థానం కల్పించినట్టు పెద్దలకు ధన్యవాదములు తెలియజేశారు. రాబోయే రోజుల్లో బిజెపిని గ్రామ గ్రామన మరింత బలో పేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపిని గెలిపించడం కోసం తన సాయి శక్తుల కృషి చేస్తానని తెలిపారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఎమ్మెల్సీని కలిసిన యుటీఎఫ్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రాంజీ నగర్ ఆఫీస్ ఏపీ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యాయ సంఘం నేతలు.. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని కలిసి ఉపాధ్యాయులకు పిఆర్‌సి అమలుకు ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసేలా.. ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకు రావాలని కోరుతూ చంద్రశేఖర్ రెడ్డికి శుక్రవారం మేమరాండం అందజేశారు. అలాగే ఐఆర్ ప్రకటించడం, ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలు తక్షణమే విడుదల చేసే విధంగా, శాసనమండలిలో తమ సమస్యలను ప్రస్తావించి, ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలు, శాసనమండలిలో ప్రస్తావించడంతోపాటు, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటానికి, తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానని చంద్రశేఖర్ రెడ్డి వారికి తెలియజేశారు.

# పొదలకూరులో శివరాత్రి బ్రహ్మోత్సవాలు

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని చోళుల కాలం నాటి పురాతన శివాకయంలో ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. శుక్రవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తన కార్యాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ స్వామి, టిడిపి నాయకులు తలచీరు మస్తాన్ బాబు, బొద్దులూరు మల్లిఖార్జున్ నాయుడు, బక్కయ్య నాయుడు, కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డిలు ఆలయ అధికారులతో కలిసి కరపత్రాలు ను ఆవిష్కరణ చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, వాహన సేవలు, ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాలు భాగంగా 14న అంకురార్పణతో ప్రారంభమవుతాయి. అదే రోజు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 15న రాత్రి 12 గంటలకు సంప్రదాయబద్ధంగా స్వామివారి నందివాహన సేవ నిర్వహించనున్నారు. 16వ తేదీ (సోమవారం) ఉదయం గజవాహన సేవ జరగనుంది. 17వ తేదీ (మంగళవారం)న కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. 18వ తేదీ (బుధవారం)న అలకలతోపు కార్యక్రమం జరుగుతుంది. 19వ తేదీ (గురువారం)న ధ్వజావరోహణతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీతో పాటు ప్రత్యేక అలంకార సేవలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మరియు సాయంత్రం 7 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృప పొందాలని ఆలయ అధికారులు,కూటమి నాయకులు కోరారు.